జగన్ విధ్వంసాన్ని అధిగమించి,
సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి
బాటలో నడిపిస్తున్నారు. అభివృద్ధి చేసి
వచ్చే ఆదాయంతోనే సంక్షేమం
కొనసాగాలి. అప్పు చేసి ఖర్చు
చేయడం పరిపాలన కాదు. ప్రజల
ఆశీర్వాదంతో ఏడాదిగా సుదీర్ఘ
సుపరిపాలన అందిస్తున్నాం.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



మంగళవారం 12.08.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 121 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


### కార్గో హ్యాండ్లింగ్ కోసం లాజిస్టిక్స్ కార్పోరేషన్

### ఎకనమిక్ హబ్‌గా పోర్టులు-ఎయిర్ పోర్టులు

### సరుకు రవాణా మార్గాలకు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్

### షిప్ బిల్డింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు

### మరిన్ని పెట్టుబడుల కోసం మారిటైం పాలసీలో మార్పులు

### పరిశ్రమలు, మౌలిక సదుపాయాల సమీక్షలో సీఎం చంద్రబాబు



# ఎకనమిక్ హబ్‌గా పోర్టులు

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీతో పాటు పొరుగు రాష్ట్రాల సరకు రవాణాను నిర్వహించేందుకు లాజిస్టిక్స్ కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఓడరేవులు, విమానాశ్రయాలు, రహదారులు, రైలు, అంతర్గత జల రవాణా మార్గాల ద్వారా చేపట్టే సరకు రవాణాను ఈ కార్పోరేషన్ ద్వారానే నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో పరిశ్రమలు, మౌలిక సదుపాయాలపై సమీక్షించారు. ఎయిర్ పోర్టులు-పోర్టుల అభివృద్ధి, మారిటైం పాలసీలో తీసుకురావాల్సిన మార్పులు, లాజిస్టిక్స్ కార్పోరేషన్ ఏర్పాటు వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.."రాష్ట్రంలో 20 పోర్టులు, మరిన్ని ఎయిర్ పోర్టుల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాం. ఆపరేషనల్గా ఉన్న పోర్టులు, ఎయిర్ పోర్టుల నుంచి పెద్ద ఎత్తున కార్యకలాపాలు జరుగుతున్నాయి. ప్రతి పోర్టు, ఎయిర్ పోర్టుల సమీప ప్రాంతాలను ఆర్ధిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి. ఓడరేవులు, విమానాశ్రయాలకు అనుసంధానించేలా శాటిలైట్ టౌన్ షిప్పులను అభివృద్ధి చేయాలి. దీనివల్ల కొత్తగా మరిన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. ఆర్ధిక కార్యకలాపాలు పెరుగుతాయి. తద్వారా సంపద సృష్టి జరుగుతుంది. ఈ తరహా సమీకృత అభివృద్ధి ఎక్కడెక్కడ చేయగలమో..ఏ విధంగా చేయగలమనే అంశాలపై బ్లూ ప్రింట్ సిద్ధం చేసుకోవాలి. ఇదే సమయంలో సరుకు రవాణపై ప్రత్యేక దృష్టి సారించాలి. రోడ్డు, రైలు, ఎయిర్ కార్గో, ఇన్ ల్యాండ్, మారి టైమ్ కార్గోలకు ఏపీనే కేంద్రంగా ఉండాలి. తక్కువ వ్యయం అయ్యే మార్గం ద్వారా సరుకులను రవాణా చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఉత్తర-దక్షిణాది రాష్ట్రాలకు వెళ్లాలంటే ఏపీనే కేంద్రం. ఇలాంటి పరిస్థితుల్లో ఏపీలో అన్ని రకాల సరుకు రవాణా మార్గాలు అందుబాటులో ఉంటే...అభివృద్ధి వేగంగా జరుగుతుంది. పోర్టులు, ఎయిర్ పోర్టులకు అనుసంధానంగా నేషనల్ హైవే కనెక్టివిటీ, రైల్ కనెక్టివిటీ ఉండేలా చూసుకోవాలి. రోడ్లపై ఎక్కడా పాత్ హోల్స్ లేకుండా ఉండాలి. అలాగే ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ కనెక్టివిటీ కూడా ఉంటే...రాష్ట్రం నుంచే సరుకు రవాణా ఎక్కువగా జరుగుతుంది. కేంద్రం వద్ద నేషనల్ హైవేలకు, రైల్వేలకు నిధుల కొరత లేదు. మనం ప్రణాళికలు సిద్ధం చేసుకుని ప్రతిపాదనలు పంపితే వాటిని ఇవ్వడానికి కేంద్రం సిద్ధంగా ఉంది. దీన్ని మనం సద్వినియోగం చేసుకోవాలి." అని చంద్రబాబు సూచించారు.

**మౌలిక సదుపాయాల చోదక శక్తిగా లాజిస్టిక్స్ కార్పోరేషన్:** "రాష్ట్రంలో వివిధ మార్గాల ద్వారా చేపట్టే సరకు రవాణాను సమర్ధంగా నిర్వహించేందుకు లాజిస్టిక్స్ కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి. పోర్టులు, ఎయిర్ పోర్టుల సమీపంలో శాటిలైట్ టౌన్ షిప్పుల అభివృద్ధికి అవసరమైన సంస్థలను గుర్తించి పీపీపీ విధానంలో అభివృద్ధి చేయాలి. మిగతా 2లో...



## వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా..

## ఆగస్టు 15 నుంచి 700 సేవలు

- నియోజకవర్గాల్లో సమస్యలపైనా శాస్త్రీయ విశ్లేషణ జరగాలి
- నవంబరు కల్లా డేటా లేక్ పూర్తి
- డ్రోన్లను పెద్ద ఎత్తును వినియోగించుకోవాలి
- పురుగుమందులు, ఎరువుల వినియోగం తగ్గేలా టెక్నాలజీని ఉపయోగించుకోవాలి
- ఆర్టీజీఎస్ పై సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- ఆర్టీజీఎస్ లో అవేర్ 2.0 వెర్షన్ ను ఆవిష్కరించిన సీఎం

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** ఈ నెల 15వ తేదీ నుంచి మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 700 రకాల ప్రభుత్వ సేవలను పౌరులకు అందించనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. సోమవారం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్ సొసైటీ (ఆర్టీజీఎస్) కేంద్రాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సందర్శించి, సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్‌లో సేవలు పొందడంలో పౌరులకు ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా సంబంధిత శాఖలన్నీ చూసుకునేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మిగతా 2లో...

## హజ్-2026 యాత్రకు.. 2649 దరఖాస్తులు



- కూటమి ప్రభుత్వం చర్యలతో భారీగా పెరిగిన హజ్ యాత్రికుల సంఖ్య
- 2019 తర్వాత ఏపీ నుండి అత్యధిక యాత్రికులు
- విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం కు ప్రాధాన్యత
- రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యల తో హజ్-2026 యాత్ర కోసం 2649 మంది యాత్రికులు ఆన్ లైన్ లో దరఖాస్తులు చేసుకున్నారని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. మిగతా 2లో...

## త్వరలోనే నూతన ఫిల్మ్ పాలసీ

- ఏపీలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి కృషి
- నిర్మాతలతో జరిగిన భేటీలో మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి
- సినిమా పరిశ్రమకు సంబంధించిన సమస్యలతో రూపొందించిన డాక్యుమెంట్
- మంత్రి కందుల దుర్గేష్ కు అందించిన నిర్మాతలు
- సినిమా షూటింగ్ లు, కొత్త సినిమా విడుదల, నూతన ఫిల్మ్ పాలసీ తదితర అంశాలపై చర్చ

2 లో



## ర్యాగింగ్‌పై ఉక్కుపాదం

- వైద్య కళాశాలల్లో ర్యాగింగ్ మాటే వినపడకూడదు
- మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** వైద్య కళాశాలల్లో యాంటీ ర్యాగింగ్ కార్యక్రమాల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయాన్ని ఆదేశించారు. కొత్తగా ప్రవేశాలు పొందే విద్యార్థులతో సత్ప్రవర్తనతో మెలిగే వాతావరణాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో తీసుకురావాలని స్పష్టం చేశారు.

మిగతా 2లో...



## కార్మికుల సంక్షేమమే ధ్యేయం

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** కార్మికుల భద్రత, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, కార్మికుల ఆరోగ్య రక్షణకు కృషి చేస్తున్నామని రాష్ట్ర కార్మిక, కర్మాగార, బాయిలర్స్ అండ్ వైద్య భీమా సేవల శాఖామాత్యులు వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఈఎస్ఐ వైద్యశాల ప్రాంగణంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో సీఎస్ఆర్ ఫండ్స్ తో ఏర్పాటు చేసిన 2 అంబులెన్స్ లను మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ ఈఎస్ఐ వైద్యశాలల్లో 500 ఖాళీలను త్వరలో భర్తీ చేయనున్నామని మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. అలాగే వైద్యశాలల్లో వైద్య పరికరాల కోనుగోలుకు అనుమతులు వచ్చాయన్నారు.

ఫ్యాక్టరీల్లో జీరో ప్రమాదాల నివారణకు కూటమి ప్రభుత్వం శాయశక్తుల కృషి చేస్తుందన్నారు. గత



ప్రభుత్వ తప్పిదాల వల్లే గతేడాది కర్మాగారాల్లో ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, వాటి నివారణకు పలు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్మికుల ఆరోగ్య భద్రపై దృష్టి సారించామని వారికి అవసరమైన సేవలను 24 గంటలు అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మిగతా 3లో...

## రోగుల సేవలపై ఆరా

- సామాజిక బాధ్యతగా వైద్యులు రోగులకు సేవలు అందించాలి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- దివంగత నేత నందమూరి తారక రామారావు టెక్కలిలో ఆసుపత్రిని నెలకొల్పారు
- వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాల్సిందే
- అన్ని వార్డులు తిరిగి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీసిన మంత్రి



**టెక్కలి, (జర్నలిస్ట్ ఫైల్):** వైద్యులు సామాజిక బాధ్యతగా విధులు నిర్వహించి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఉదయం 8.30 గంటలకు టెక్కలి కేంద్రంలో మిగతా 2లో...

## 13వ తేదీన జీవోఎం భేటి



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లా, మండల, గ్రామాల పేర్లు, సరిహద్దులు మార్పులు చేసేందుకు తగిన సూచనలు చేసేందుకై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రుల బృందం మొదటి సారి ఈనెల 13వ తేదీన అంటే బుధవారం ఉదయం 11 గంటలకు వెలగపూడి సచివాలయంలోని రెండో బ్లాక్ మొదటి అంతస్తులో గల కాన్ఫరెన్స్ హాల్లో సమావేశమౌతోందని రాష్ట్ర రెవెన్యూ,రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. 2లో...

## డిఎస్సి ఫలితాలు విడుదల



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో 16,347 ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి నిర్వహించిన మెగా డిఎస్సి-2025 ఫలితాలు విడుదలయ్యాయి. అభ్యర్థుల నుంచి వచ్చిన అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించి సవరించిన తుది కీ ఆధారంగా నార్మలైజేషన్ ప్రక్రియ ద్వారా తుది ఫలితాలను విడుదల చేశామని డిఎస్సి కన్వీనర్ ఎంవి కృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా తుది ఫలితాలను, స్కోర్ కార్డులను పొందవచ్చని వెల్లడించారు. టెట్ వివరాలకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో https://apdsc.apcfss.in తమ హాల్ టిక్కెట్ నెంబర్ నమోదు చేసి తెలుసుకోవచ్చునని తెలిపారు.

మిగతా 2లో...

## ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి సత్కారం



**న్యూ ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చి, మన శత్రు దేశాలకు, ప్రపంచ దేశాలకు భారత సైనిక శక్తి, సామార్థ్యాలను తెలియజేసి, ఆపరేషన్ సింధూర్ విజేతగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నిలిచారని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

మిగతా 2లో...

## నేతన్నల జీవితాల్లో వెలుగులు




- నేతన్నలను కార్పొరేట్ వ్యాపారుస్తులుగా తయారు చేయడమే మంత్రి నారా లోకేష్ ధ్యేయం
- చేనేతలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతగా మంగళగిరిలో భారీ ర్యాలీ
- ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్న చేనేత వృత్తి దారులు, కళాకారులు, చేనేత కుటుంబ సభ్యులు

మిగతా 3లో...

# వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా.. ఆగస్టు 15 నుంచి 700 సేవలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు వెళ్లాల్సిన అవసరం లేకుండా పౌరులు వాట్సాప్ ద్వారానే సేవలు పొందవచ్చని దీనిపై పౌరులకు మరింత అవగాహన కల్పించాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ వినియోగించుకునే వారి శాతం మరింత పెరగాలన్నారు. ఈ సందర్భంగా ఆర్టీజీఎస్ లోని అవేర్ విభాగం రూపొందించిన అవేర్ 2.0 వెర్షన్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. రాష్ట్రంలో వర్షపాతాన్ని ముందుగానే ఈ విధానం ద్వారా అంచనా వేయొచ్చు అన్నారు. నదుల్లోకి పరివాహక ప్రాంతాల నుంచి ఏ సమయంలో ఎంత మాత్రం వర్షపు నీరు వస్తుంది, కురిసిన వర్షం భూమిలోకి ఎంతమేర ఇంకుతోంది, వర్షపు నీటిని సమర్థవంతంగా ఎలా వినియోగించుకోవాలనే దానిపైన రియల్ టైమ్ డేటా విశ్లేషణ చేసి సంబంధిత శాఖలను ఆర్టీజీఎస్ ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రస్తుత అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గ్రామాల్లో చెరువుల పరిస్థితి కూడా ఎప్పటికప్పుడు తెలుసుకునే సదుపాయం ఉంది కాబట్టి నీటి కరవు లేకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. సీసీ కెమెరాలను ఉపయోగించుకుని రియల్ టైమ్‌లో విశ్లేషించుకుని శాంతిభద్రతల పర్యవేక్షణకు సమర్థవంతంగా ఉపయోగించుకోవాలన్నారు. వీటిని కేవలం ట్రాఫిక్ ఉల్లంఘనలు, శాంతిభద్రతల పర్యవేక్షణకే కాకుండా





వరదలు, తుపాన్ల వంటి సమయంలో రోడ్లపై ఎక్కడెక్కడ వర్షపు నీరు, వరద నీరు నిలిచిపోయింది తదితర అంశాలు పరిశీలించి ఎప్పటికప్పుడు ఆ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసేలా చూడాలన్నారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన పౌరులకు వాట్సాప్ ద్వారా వాళ్లు ఎలా ఉల్లంఘనకు పాల్పడింది వీడియోలు పంపి వారికి తెలియజేసి తదుపరి అలాంటి ఉల్లంఘనలకు పాల్పడకుండా చైతన్యవంతం చేయాలన్నారు.

**డ్రోన్ యూస్ కేసెస్ పెరగాలి :** రాష్ట్రంలో డ్రోన్ సేవలు విస్తృతంగా అందేలా డ్రోన్ కార్పొరేషన్ పనిచేయాలని సీఎం అన్నారు. ప్రస్తుతం డ్రోన్ల ద్వారా 45 యూస్ కేసెస్ సిద్ధంగా ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. దీనిపైన సీఎం స్పందిస్తూ వ్యవసాయరంగంలో డ్రోన్ల వినియోగం పెరిగేలా చూడాలన్నారు. పురుగు మందుల వినియోగం గణనీయంగా తగ్గించడానికి రైతులు డ్రోన్లు ఉపయోగించుకునేలా చేయాలని చెప్పారు. అంటు వ్యాధుల నివారణకు, దోమల వ్యాప్తిని అరికట్టడానికి డ్రోన్లను విరివిగా వినియోగించుకోవాలన్నారు. డ్రోన్ సిటీ నిర్మాణ పనుల వేగవంతం చేయాలని కోరారు.

**డేటా లేక్ తో సత్ఫలితాలు :** ఆర్టీజీఎస్ డేటా లేక్ పనులు నవంబరుకల్లా పూర్తి చేయాలన్నారు. ఈ డేటాను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను ఎక్కువగా ఉపయోగించుకోవాలని చెప్పారు. మన వద్ద ఉన్న డేటాతో ఆయా శాఖలు ఏమేం కావాలని కోరుకుంటున్నాయో ఆయా శాఖల అధికారులు, కార్యదర్శులతో చర్చించి ఆ దిశగా యూస్ కేసెస్ రూపొందించేలా ఆర్టీజీఎస్ పనిచేయాలన్నారు. ఈ-క్రాప్ డేటాను, ఆయా ప్రాంతాల్లో భూసార డేటాను అనుసంధానించుకుని విశ్లేషించి, ఆయా ప్రాంతాల్లో రైతులు తక్కువగా ఎరువులు వినియోగించుకునేలా ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాలున్నాయని, ఆయా నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన పనుల గురించి కూడా ఒక శాస్త్రీయ విశ్లేషణ ఉండాలన్నారు. ఆర్టీజీఎస్ పనితీరు, ప్రగతి గురించి ఐటీ మరియు ఆర్టీజీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటంనేని వివరించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్, డిప్యూటీ సీఈఓ ఎం మాధురి తదితరులు పాల్గొన్నారు.

## ఎకనమిక్ హబ్‌గా పోర్టులు



(మొదటి పేజీ తరువాయి)

లాజిస్టిక్ కార్పోరేషన్ అనేది రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి గ్రోత్ ఇంజిన్ మాదిరిగా ఉండాలి. ఇదే తరహాలో 175 నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసుకుంటున్న ఎంఎస్ఎంఈ పార్కుల వద్ద కూడా శాటిలైట్ టౌన్ షిప్పులను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు చేయాలి. కుప్పం, దగదర్తి విమానాశ్రయాల నిర్మాణానికి సంబంధించిన పనులను వేగవంతం చేయాలి. అనుకున్న సమయానికి భూసేకరణ పూర్తి చేసి పనులు మొదలు పెట్టాలి. ఈ ఎయిర్ పోర్టులను నేషనల్ హైవేలను కలిపేలా అంతర్గత రోడ్ల నిర్మాణం ఉండాలి. అవసరమైతే వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ద్వారా దీనిని చేపట్టాలి." అని సీఎం చెప్పారు.

**పెట్టుబడులను ఆకర్షించేందుకు మారిటైం పాలసీలో మార్పులు :** పెట్టుబడులను మరింతగా ఆకర్షించేందుకు వీలుగా మారిటైమ్ విధానంలో మార్పులు చేయాలని ముఖ్యమంత్రి సూచనలు చేశారు. పోర్టులు, టెర్మినల్స్, షిప్ బిల్డింగ్ యూనిట్లు, అంతర్గత జల రవాణా మార్గాలు, క్రూయిజ్ టెర్మినళ్ల ఏర్పాటు చేసేందుకు మార్గం సుగమం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రం అమలు చేస్తున్న షిప్ బిల్డింగ్ క్లస్టర్ స్కీం పాలసీకి అనుగుణంగా మారిటైం పాలసీలో మార్పులు చేసుకోవాలని అధికారులు చెప్పారు. ఈ మేరకు అవసరమైన మార్పులు చేసేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారు. అలాగే షిప్ బిల్డింగ్ యూనిట్ల నిర్మాణం కోసం మచిలీపట్నం, మూలపేట, చినగంజాం వంటి ప్రాంతాల్లో షిప్ బిల్డింగ్ యూనిట్ల ఏర్పాటుకు కొన్ని సంస్థలు ముందుకు వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ "రాష్ట్రంలో షిప్ బిల్డింగ్ యూనిట్లు ఎన్ని చోట్ల ఏర్పాటు చేయడానికి అనువుగా ఉంటుందో చూడాలి. పోర్టుల నిర్మాణం, షిప్ బిల్డింగ్ యూనిట్ల నిర్మాణం చేసే సమయంలో స్థానిక మత్స్య కారులకు ఇబ్బంది లేకుండా చూడాలి. మత్స్య కారులకు సంబంధించిన పనిముట్లు, పరికరాలను పెట్టుకోవడానికి వీలు కల్పించేలా ఉండాలి. కంటైనర్ పోర్టుల ఏర్పాటు, అభివృద్ధి పై మీద మరింత దృష్టి పెట్టాలి. గత ప్రభుత్వం నిర్వాకం వల్ల కంటైనర్ పోర్టు తమిళనాడుకు వెళ్లిపోయింది. అలాంటి పరిస్థితులు రాకూడదు." అని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## హజ్-2026 యాత్రకు.. 2649 దరఖాస్తులు




(మొదటి పేజీ తరువాయి)

ఇందులో 2314 మంది అర్హులుగా గుర్తించబడ్డారని, 2019 తర్వాత ఏపీ నుండి హజ్ యాత్రకు వచ్చిన దరఖాస్తుల్లో ఇదే అత్యధిక దరఖాస్తులని అమరావతి లో సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. విజయవాడ గన్నవరం ఎయిర్పోర్ట్ నుండి నుంచి వెళ్లే వారికి రూ. లక్ష ఆర్థిక సాయం అందిస్తామని సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గత ఏడాది ప్రకటించిన విషయాన్ని మంత్రి ఫరూక్ గుర్తు చేశారు. హజ్ -2025 యాత్ర కు విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రాన్ని మొదటి ప్రాధాన్యతగా ఎన్నుకొని, తదుపరి సాంకేతిక కారణాలవల్ల హైదరాబాద్, బెంగళూరు కేంద్రాల నుండి 72 మంది యాత్రికులు హజ్ కు వెళ్లడం జరిగిందన్నారు. దిగ్విజయంగా హజ్ పూర్తి చేసి వచ్చిన ఈ హాజీలకు ఒక్కొక్కరికి లక్ష ప్రకారం 72 మందికి మంజూరు చేయడం, 24 గంటల వ్యవధిలోనే వారి బ్యాంకు అకౌంట్లకు మొత్తాన్ని జమ చేసి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చిందని వెల్లడించారు. విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం పునరుద్ధరణ, హజ్-2026 కు దరఖాస్తు గడువు పెంపు విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సకాలంలో జోక్యం చేసుకొని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో గన్నవరం పునరుద్ధరణతోపాటు, దరఖాస్తు గడువును కేంద్ర హజ్ కమిటీ పొడిగించిందన్నారు. గడువు పెంపుతో విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం ను మొదటి ప్రాధాన్యతగా ఎన్నుకునేందుకు ప్రభుత్వ విస్తృత ప్రచారంతో హజ్-2026 దరఖాస్తుదారుల్లో 389 మంది యాత్రికులు విజయవాడ ఎంబార్కేషన్ కు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. మరో 627 మంది యాత్రికులు రెండవ ప్రాధాన్యత ఎన్నుకున్నారని తెలిపారు. మొత్తం దరఖాస్తుదారుల్లో 128 మంది యాత్రికులు 65 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు కలవారని తెలిపారు. విజయవాడ కేంద్రాన్ని ఎన్నుకుని హజ్ యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసినవారికి రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్ష ఆర్థిక సహాయం అందించడంతో హజ్ - 2026 యాత్రికుల నుండి విజయవాడ ఎంబార్కేషన్ ఎన్నుకోవడానికి విశేషమైన స్పందన లభించిందని మంత్రి ఫరూక్ తెలిపారు. హజ్-2025 కు ఏపీ నుండి 1618 మంది హాజీలు వెళ్ళగా, వీరందరి సౌకర్యాల కోసం తెలంగాణ,కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాల సహకారం, సమన్వయంతో ఏపీ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. 2026 హజ్ కు విజయవాడ ఎంబార్కేషన్ పునరుద్ధరణ మరియు మొదటి ప్రాధాన్యతగా దీనికి విశేష స్పందన లభించడంతో కూటమి ప్రభుత్వం మరింత పకడ్బందీగా, విస్తృత ఏర్పాట్లు చేయడం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. విజయవాడ నుండి వెళ్లే ప్రతి హజ్ యాత్రికునిపై అదనపు ఛార్జీల భారం పడకుండా రూ. లక్ష ఆర్థిక సాయం ను కూటమి ప్రభుత్వం అందజేస్తుందని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ స్పష్టం చేశారు.

## డిఎస్సీ ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

ఈ అవకాశం ఈ నెల 13వ తేదీ వరకు మాత్రమే ఉంటుందని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత.. 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ నియామకానికి మెగా డీఎస్సీ నిర్వహించింది. ఈ పరీక్ష కోసం మొత్తం 3,36,307 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది జూన్ 6 నుంచి జులై 2వ తేదీ వరకు.. అంటే 23 రోజుల పాటు ఈ పరీక్షలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఆ రాష్ట్రానికి సరిహద్దులుగా ఉన్న తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, ఒడిశాల్లో సైతం ఈ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ మెగా డీఎస్సీ పరీక్షలకు 92.90 శాతం మంది హాజరయ్యారు.

# త్వరలోనే నూతన ఫిల్మ్ పాలసీ



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, త్వరలోనే సమగ్రమైన నూతన ఫిల్మ్ పాలసీని తెస్తామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. సోమవారం వెలగపూడి సెక్రటేరియట్ లోని రెండవ బ్లాక్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ఈ మేరకు మంత్రి కందుల దుర్గేష్ తో సినీ నిర్మాతలు భేటీ అయ్యారు. సినిమా పరిశ్రమకు సంబంధించిన సమస్యలతో రూపొందించిన డాక్యుమెంట్ ని నిర్మాతలు మంత్రి కందుల దుర్గేష్‌కు అందించారు. సినిమా పరిశ్రమ సమస్యలు, 24 విభాగాల అభివృద్ధిపై సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లతో సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా మంత్రి దుర్గేష్ ను నిర్మాతలు అభ్యర్థించారు. ఈ సందర్భంగా సినిమా షూటింగ్ లు, కొత్త సినిమా విడుదల, నూతన ఫిల్మ్ పాలసీ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం సెప్టెంబర్ మొదటి లేదా రెండో వారంలో సీఎం, డిప్యూటీ సీఎంలతో సమావేశం ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏ సహకారం కావాలని కోరుకుంటున్నారు, చిత్ర పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర అధ్యయనం చేసి సరైన ప్రతిపాదనలతో రావాలని సూచించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ తెలుగు సినిమా పరిశ్రమ అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహకారం, చేస్తున్న కృషిని సినీ నిర్మాతలు అభినందించిందని మంత్రి దుర్గేష్ తెలిపారు. రాష్ట్రంలో తెలుగు చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించామన్నారు. రాష్ట్రంలో స్టూడియోల నిర్మాణం, డబ్బింగ్ థియేటర్లు, రీ రికార్డింగ్ థియేటర్లు తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటు అంశంలో ముందుకు వస్తే ప్రభుత్వ సహకారం అందిస్తామన్నారు. ఈ అంశంపై త్వరలోనే ఒక సమావేశం ఏర్పాటుకు చేసి నిర్ణయం తీసుకుంటామన్నారు. నిర్మాతలు సూచించిన సలహాలు, సూచనలు సీఎం, డిప్యూటీ సీఎం ల దృష్టికి తీసుకెళ్లడానికి ఈ సమావేశం తొలి మెట్టుగా భావిస్తున్నామన్నారు.

నంది అవార్డులు, నంది నాటకోత్సవాల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టమైన నిర్ణయం తీసుకున్నారని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పష్టమైన సూచనలు చేశారని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఈ ఏడాది నంది అవార్డులు తప్పకుండా ఇస్తామని స్పష్టం చేశారు. ఏ విధానంలో నంది అవార్డుల కార్యక్రమం నిర్వహిస్తే చిత్ర పరిశ్రమకు ఉపయోగపడుతుందో ఆ తరహా ఆలోచన చేసి నిర్ణయం తీసుకోవాలని నిర్మాతలకు సూచించారు. తదుపరి సమావేశంలో నంది అవార్డుల విషయంపై స్పష్టత వస్తుందన్నారు. ఇరు రాష్ట్రాలకు తెలుగు సినిమా ఒక్కటే అన్నారు. ఉత్తమ చిత్రం ఎక్కడైనా ఉత్తమంగానే నిలబడుతుందని అన్నారు. నంది అవార్డుల ఎంపిక ఇరు రాష్ట్రాలు కలసి చేయాలా, విడివిడిగా చేయాలనే అంశంపై నిర్మాతలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారని తెలిపారు. ఈ అంశాన్ని సీఎం, డిప్యూటీ సీఎం ల దృష్టికి తీసుకువెళ్తానన్నారు. సినిమా రూపకల్పన, విధి విధానాల విషయంలో బడ్జెట్ ను ప్రాతిపదికగా తీసుకొని ఏయే సినిమాలకు ప్రభుత్వం తరఫున ఏ రకమైన సాయం అందించాలనే అంశంపై చర్చించామన్నారు. త్వరలోనే ఈ అంశంపై తగు నిర్ణయం తీసుకుంటామని నిర్మాతలకు మంత్రి దుర్గేష్ స్పష్టమైన వివరణ ఇచ్చారు.

# రోగుల సేవలపై ఆరా

(మొదటి పేజీ తరువాయి)



జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది సమయపాలనను స్వయంగా పరిశీలించారు. హాజరు పట్టికలో సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఓపి విభాగం, అత్యవసర విభాగం, జనరల్ వార్డ్, ఎముకల విభాగంతో పాటు అన్ని వార్డులను స్వయంగా పరిశీలించి రోగులతో మాట్లాడారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అన్ని విభాగాల్లోని ఫ్యాన్లు, లైట్లు, మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణను నిశితంగా గమనించారు. వైద్యుల పనితీరులో స్పష్టమైన మార్పు రావాలని అన్నారు. అనంతరం వైద్యులు, స్టాఫ్ నర్సులు, సిబ్బందితో ఆసుపత్రిలోని సమీవేశ మందిరంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రోగులకు ఇబ్బందులు లేకుండా ఫ్యాన్లు, లైట్లు, జనరేటర్ వినియోగంలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ఇంకా ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తానని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగుల పట్ల ఆప్యాయత, మానవత్వంతో మెరుగైన వైద్యం అందే విధంగా చూడాలని ఆసుపత్రి సూపర్నెంట్ ను ఆదేశించారు. ఆసుపత్రిని ఆకస్మాత్తుగా తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. మెరుగైన వైద్యంతోపాటు ఆసుపత్రి పరిసరాలు పరిశ్రమంగా ఉండేటట్లు, పారిశుద్ధ్య నిర్వహణ జరిగే విధంగా ప్రతినిత్యం ఉదయం పర్యవేక్షణ చేపట్టాలని ఆసుపత్రి సూపరిండెంట్ సూర్యా రావు ను ఆదేశించారు. అలాగే రోగుల పడక బెడ్ షీట్లు, మరుగుదొడ్లు, ఆసుపత్రి నిర్వహణ అంశాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆర్డీఓ ఎం.కృష్ణ మూర్తి ని సూచించారు. ప్రతీ రోజు చాలామంది రోగులు సుదూర ప్రాంతాల నుండి నమ్మకం, విశ్వాసంతో ఆసుపత్రికి వస్తున్నారని అటువంటి వారిపై వైద్యులు ఆప్యాయతతో కూడిన వైద్యాన్ని అందించాలని అన్నారు. స్టాఫ్ నర్స్ ల సిబ్బంది కొరత ఉందన్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకురాగా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నత అధికారులతో మాట్లాడి స్టాఫ్ నర్సుల నియామకానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. ధోబీ లు పడకల మీద బెడ్ షీట్లను ప్రతిరోజు మార్చే విధంగా వాషింగ్ మిషన్లను ఏర్పాటుకు అవసరమైన అంచనా విలువను నివేదికగా అందించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ సమయపాలనను పాటించి ఉదయం తొమ్మిది గంటలకు తప్పనిసరిగా విధులకు హాజరుకావాలని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ తో ఫోన్లో మాట్లాడి ఆసుపత్రి వద్ద నిత్యం భద్రత కల్పించే విధంగా ఔట్ పోస్ట్ ను ఏర్పాటు చేయాలని అన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో బయో మెడికల్ ట్రీట్మెంట్ ప్లాంట్, మార్చురీ భవన నిర్మాణాలను వచ్చే నెల 15 న వినియోగానికి సిద్ధం చేయాలని ఏపీఎంఐడిసి ఇంజనీరింగ్ అధికారి వెంకటేష్ ను ఆదేశించారు. ఆసుపత్రి ప్రాంతంలోని స్థలాన్ని సుందరంగా చదును చేసే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ ఎమ్ ఐడీసీ ఇంజనీరింగ్ అధికారి సత్య ప్రభాకర్ ఆదేశించారు. ఆసుపత్రి లో రోగులకు వైద్య చికిత్స అందించేందుకు అవసరమైన సౌకర్యాలను, అత్యవసర పరిస్థితుల్లో రోగులకు వైద్య సేవలు అందించేందుకు అంబులెన్స్ లను ఏర్పాటు చేస్తానని మంత్రి తెలిపారు. ఆస్పత్రి ప్రధాన రహదారి కి ఇరువైపులా విద్యుత్ దీపాలు, మొక్కలు నాటి ఆహ్లాద వాతావరణం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డా, లక్ష్మణ రావు, డా, మహరాజ్, స్టాఫ్ నర్సులు, వైద్య సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

**అవసరమైన సిబ్బందిని నియమిస్తాం :** ఆసుపత్రిలో అవసరమైన సిబ్బందిని నియమించడం జరుగుతందని అన్నారు. ప్రస్తుతం ఉన్న సిబ్బంది ఎంత మంది ఉన్నారు, అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. ఎన్నిఇబ్బందులు వచ్చిన వాటని అధిగమించి ముందుకు వెల్లడం జరిగిందని అన్నారు. ఆక్సిజన్ ప్లాంటులు కూడా ఏర్పాటు చేశామని వాటిని కూడా కొంతమంది అడ్డతగిలారని అన్నారు.

**దివంగత నేత నందమూరి తారక రామారావు టెక్కలిలో ఆసుపత్రిని నెలకొల్పారు :** దివంగత నేత నందమూరి తారకరామారావు హయాంలో టెక్కలిలో ఆసుపత్రిని నెలకొల్పారని గుర్తు చేశారు. పాలకొండకు తీసుకు వెళ్లేందుకు కొంతమంది ప్రయత్నాలు చేశారని, కానీ టెక్కలిలో జిల్లా ఆసుపత్రి ఏర్పాటు అయ్యే విధంగా కృషి చేయడం జరిగిందని పేర్కొన్నారు. దీనితో సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న రోగులకు వైద్యం అందించడం జరుతుందని అన్నారు. 100 పడకల ఆసుపత్రిని 200 పడకల ఆసుపత్రి చేయడం జరిగిందని అన్నారు. గత ప్రభుత్వం వైద్యరంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. వైద్య రంగానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు.

**బీసీ వసతి గృహల అధికారులతో సమావేశం :** బీసీ వసతి గృహాల అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని, రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వసతి గృహాల వార్డెన్లు పాల్గొన్నారు.

## ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి సత్కారం



(మొదటి పేజీ తరువాయి)

సోమవారం ఆపరేషన్ సింధూర్ విజయవంతం అయిన సందర్భాన్ని పురస్కరించుకొని న్యూ ఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణలోని ప్రధాన మంత్రి కార్యాలయంలో టీడీపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ తో పాటు టిడిపి పార్లమెంట్ సభ్యులు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీని మర్యాద పూర్వకంగా కలిసి తెలుగుదేశం పార్టీ తరుపున శుభాకాంక్షలు తెలియజేసి, ఆపరేషన్ సింధూర్ విజేత ప్రధాని మోడీ అంటూ ఘనంగా సన్మానం చేశారు.

# ర్యాగింగ్‌పై ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)




నూతనంగా వచ్చే విద్యార్థులకు సద్భావన, ఆహ్లాదపూర్వకమైన వాతావరణం కలిగించే బాధ్యత సీనియర్ విద్యార్థులు తీసుకోవాలని మంత్రి సూచించారు. విద్యార్థులతో అభ్యంతర కరంగా, అసభ్యకరంగా, అనైతికంగా వ్యవహరించి నట్లయితే అది ర్యాగింగ్ కిందకు వస్తుందని వెల్లడించారు. సహచరులతో అమానుషంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని స్పష్టంచేశారు. ఇదే విషయమై జాతీయ వైద్య కమిషన్ తాజాగా జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం మంగళవారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు యాంటీ ర్యాగింగ్ కు సంబంధించిన అవగాహనా కార్యక్రమాల్ని జరపాలని పేర్కొన్నారు.

**పోటీల వివరాలు :** నినాదాలు, వ్యాసరచన పోటీలు, ఫొటోగ్రఫీ పోటీలు, వాల్‌పోస్టర్ల తయారీ, వీధి నాటకాలను కళాశాలల్లో యాంటీ ర్యాగింగ్ ఇతివృత్తంతో నిర్వహించాలని వెల్లడించారు. కళాశాలల వారు కూడా వీటి నిర్వహణ విజయంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ర్యాగింగ్ వ్యతిరేక సందేశాలను ప్రోత్సహించే సంస్థల నుంచి వీడియో సందేశాలను కూడా వినియోగించుకోవచ్చునని పేర్కొన్నారు. సదస్సులు, ఇంటరాక్టివ్ సెషన్‌లు, సెల్ఫీ కార్నర్ల వంటి సృజనాత్మక అవగాహన కార్యక్రమాలు జరిగేలా చూడాలని తెలిపారు.

**విజేతలకు బహుమతులు :** పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు పూర్తి స్థాయిలో భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి మంత్రి సత్యకుమార్ దిశానిర్దేశం చేశారు. మంత్రి ఆదేశాలనుసరించి కళాశాలల్లో యాంటీ ర్యాగింగ్ అవగాహన కార్యక్రమాలు జరపాలని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ వైద్య కళాశాలలకు పంపిన ఆదేశాల్లో స్పష్టం చేశారు.

## 13వ తేదీన జీవోఎం భేటి

(మొదటి పేజీ తరువాయి)



గత వైసీపీ ప్రభుత్వం జిల్లాల పున:వ్యవస్థీకరణ చేసినప్పుడు ఒక నియమం అంటూ పాటించకుండా అడ్డదిడ్డంగా చేసేశారు. దీంతో కొన్ని జిల్లాల్లో ప్రజలు జిల్లా కేంద్రంకు వెళ్లి పని చేయించుకోవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలకు పేర్లు పెట్టడంలోనూ వివాదాలు తలెత్తాయి. మొత్తంగా జిల్లా, మండల, గ్రామాల పేర్లను మార్చాలంటూ, వాటి సరిహద్దులు మార్చాలంటూ ప్రజలు, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వానికి పదే పదే విన్నవించుకున్నారు. ఈ నేపథ్యంలో కూటమిప్రభుత్వం ఈ అంశాలపై అధ్యయనం చేసి పరిష్కార మార్గాలను చూపేందుకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తోపాటు మరో ఆరుగురితో మంత్రుల బృందాన్ని(జీవోఎం) ఏర్పాటు చేసింది. ఈ జీవోఎంలో మంత్రి అనగానితోపాటు మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణ, హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత, రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, నీటి వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ సభ్యులుగా ఉన్నారు. వీరంతా ఈనెల 13వ తేదీన మొదటి సారి సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా ప్రజలుగానీ, ప్రజా ప్రతినిధులు గానీ జిల్లా, మండల, గ్రామాల పేర్లు మార్పు, సరిహద్దుల మార్పుపైన వారి వినతులను సచివాలయానికి వచ్చి జీవోఎంకు సమర్పించవచ్చునని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

## కార్మికుల సంక్షేమమే ధ్యేయం




(మొదటి పేజీ తరువాయి)

సేవలను మరింత విస్తృత పరచడంలో భాగంగా ఎస్ బి ఐ సహకారంతో సీఎస్ఆర్ ఫండ్స్ తో ఏర్పాటు చేసిన అంబులెన్స్ లను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. కొద్ద రోజుల క్రితం యూనియన్ బ్యాంక్ సహకారంతో రూ. 43 లక్షల విలువైన అంబులెన్స్ ను ఈఎస్ఐ వైద్యశాలకు అందించడం జరిగిందన్నారు. ఈ అంబులెన్స్ ల్లో వెంటిలేటర్, ఈసీజీ తదితర రోగికి అత్యవసర స్థితిని నుంచి రక్షించడానికి అవసరమైన అన్ని పరికరాలు ఏర్పాటు చేయడమైనదన్నారు. కార్మికుల కోసం వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా రాష్ట్రంలో వైద్యశాలలు, 96 డిస్పెన్సరీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ప్రమాదకరమైన రసాయన కర్మాగారాల్లో రికార్డుల మూల్యాంకనం చేయడానికి పరిశ్రమల్లో విద్యార్థులకు ఇంటర్న్ షిప్ లు కల్పించడానికి, ప్యాక్టరీల్లో భద్రకు సంబంధించి విశ్వవిద్యాలయాల నుంచి సాంకేతిక సహకారం తీసుకునేందుకు జెఎన్టీయూ కాకినాడ యూనివర్సిటీతో మంత్రి వాసంశెట్టి సుభాష్ ఎంఓయూ చేసుకోవడం జరిగింది. ఈ నెల 4 న శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ, జేఎన్టీయూ–అనంతపురం, ఏపీ ప్రొడక్టవిటీ కౌన్సిల్ తో కూడా ఒప్పందాలు చేసుకున్నామని మంత్రి వాసంశెట్టి సుభాష్ వివరించారు. ఈ ఒప్పందాల్లో భాగంగా పరిశ్రమల్లో విద్యార్థులకు ఇంటర్నషిప్ కు అవకాశం కల్పిస్తామన్నారు. అలాగే రాష్ట్రంలోని ప్రమాదకర పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయా కర్మాగారాల కార్మికులకు అవగాహన కల్పించనున్నామన్నారు. ప్రమాదం జరిగితే రూట్ కాజ్ ఎనాలసిస్ ద్వారా విశ్లేషించి, భవిష్యత్తులో మరో సారి ప్రమాదం జరగకుండ తీసుకోవాల్సిన చర్యలను యూనివర్సిటీ బృందాలు సూచిస్తాయన్నారు.

అనంతరం ఎస్ బి ఐ అందించిన రెండు అంబులెన్స్ లను మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్మిక శాఖ కార్యదర్శి శేషగిరిబాబు, డైరక్టర్ ఆఫ్ ప్యాక్టరీస్ మోహనరావు, జెన్టీయూ–కాకినాడ రిజిస్ట్రార్ ఆర్. శ్రీనివాసరావు, ఎస్ బి ఐ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సీతాక్షి సింగ్, ఈఎస్ఐ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొత్త ఆదాయపు పన్ను బిల్లుకు ఆమోదం



**దిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** కొత్త ఆదాయపు పన్ను బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. బైజయంత్ పాండా సారథ్యంలో 31 మంది సభ్యులతో కూడిన సెలక్షన్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు నవీకరించిన బిల్లును ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం ప్రవేశపెట్టారు. బిల్లు ప్రవేశపెట్టిన 3 నిమిషాలకే ఎలాంటి చర్చా జరగకుండానే మూజువాణి ఓటుతో సభామోదం పొందింది. బిహార్ ఓటర్ల సమగ్ర సవరణపై విపక్షాలు ఆందోళన నిర్వహిస్తుండడంతో దీనిపై చర్చకు తావులేకుండా పోయింది. బిల్లు పాసైన అనంతరం సభ మంగళవారానికి వాయిదా పడింది.

ఆరు దశాబ్దాలుగా అమల్లో ఉన్న ఆదాయపు పన్ను చట్టం–1961 స్థానంలో ఈ ఏడాది ఫిబ్రవరిలోనే కేంద్రం లోక్‌సభలో ఆదాయపు పన్ను బిల్లు, 2025ను ప్రవేశపెట్టింది. విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో దాన్ని సెలక్ట్ కమిటీకి పంపించింది. కమిటీ ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకున్న అనంతరం.. ఆదాయపు పన్ను (నం. 2) బిల్లు–2025ను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేడు లోక్‌సభలో ప్రవేశపెట్టారు. గత శుక్రవారం పాత బిల్లును ఉపసంహరించుకున్నారు. సెలక్ట్ కమిటీ సిఫార్సులన్నింటినీ దాదాపుగా ఆమోదించినట్లు మంత్రి వెల్లడించారు. 1961లో రూపొందించిన ఆదాయపు పన్ను చట్టానికి 66 బడ్జెట్‌లలో (రెండు మధ్యంతర బడ్జెట్లు కలిపి) ఎన్నో సవరణలు జరిగాయి. దీంతో సంక్లిష్టంగా తయారైంది. దీంతో ఈ చట్టాన్ని సమీక్షించి, సరళతరం చేస్తామని 2024 జులై బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఆ మేరకు కొత్త బిల్లును రూపొందించారు. లోక్‌సభ ఆమోదం పొందిన నేపథ్యంలో ఈ బిల్లు తదుపరి రాజ్యసభకు వెళ్లనుంది. రాష్ట్రపతి ఆమోద ముద్రతో కొత్త చట్టంగా మారనుంది. 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది.

**బిల్లులోని కీలక అంశాలు.. :** పాత ఆదాయపు పన్ను చట్టంలో 'క్రితం సంవత్సరం' 'అసెస్‌మెంట్ ఇయర్' అనే పదాలు వాడుకలో ఉన్నాయి. కొత్త బిల్లులో వీటి స్థానే 'పన్ను సంవత్సరం' వినియోగంలోకి రానుంది.

2025 ఆదాయపు పన్ను బిల్లు కొత్త పన్నులేమీ విధించదు. ప్రస్తుతం ఉన్న పన్ను శ్లాబులు, రేట్లను మార్చదు. అలాగే ఐటీఆర్ ఫైలింగ్ గడువు తేదీలు, ఆదాయపు పన్ను శ్లాబులు, మూలధన లాభాల్లో ఎటువంటి మార్పులూ ఉండవు.

వేతనాల నుంచి డిడక్షన్ల విషయానికొస్తే అంటే స్టాండర్డ్ డిడక్షన్, గ్రాడ్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితరాలు వేర్వేరు సెక్షన్లు, నిబంధనల కింద ఉన్నాయి. వీటిని ఒకే దగ్గరకు తీసుకొచ్చి పట్టిక రూపంలో కనిపిస్తాయి.

## ఎన్నికల నియమావళి మేరకే బూత్‌లు



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** పులివెందుల, ఒంటిమిట్ట జడ్.పి.టి.సి. ఉప ఎన్నికలకు సంబందించి పోలింగ్ బూత్ ల ఏర్పాటు అనేది ఎన్నికల సంఘం నియమావళి ప్రకారమే జరిగిందని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి గాని, ముఖ్యమంత్రికి గాని ఎటు వంటి ప్రమేయం లేదని రాష్ట్ర హెూం మరియు డిజాస్టర్ శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో పాత్రికేయులతో ఆమె మాట్లాడుతూ ఒంటిమిట్ట, పులివెందుల జడ్.పి.టి.సి. ఉప ఎన్నికలకు సంబందించి బూత్ ల ఏర్పాటుపై అభ్యంతరాలు ఏమన్నా ఉంటే తెల్పాలని నోటిఫికేషన్లను వరుసగా గత నెల 17 మరియు 19 తేదీల్లో జారీ చేయడం జరిగిందన్నారు. ఈ విషయంలో ఏ రాజకీయ పార్టీ ఎటు వంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకపోవడంతో ప్రతిపాదిత బూత్ లను ఎన్నికల సంఘం ఖరారు చేయడం జరిగిందన్నారు. ఈ విషయంలో తమ ప్రభుత్వానికి ఎటు వంటి ప్రమేయం లేదన్నారు. అయితే ఈ విషయాన్ని రాజకీయం చేస్తూ ప్రధాన ప్రతిపక్షపార్టీ నాయకుడు ప్రభుత్వంపై బురదజల్లేలా మాట్లాడం ఎంతో విడ్డూరంగా ఉందన్నారు. గ్రామ పంచాయితీల ప్రాతిపదికగా ఒంటిమిట్ట, పులివెందుల జడ్.పి.టి.సి. ఉప ఎన్నికలకు బూత్ ల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పులివెందుల్లో 15 బూత్ లు మరియు ఒంటిమిట్టలో 30 బూత్ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పులివెందుల్లో ఎన్నికలు అనేవి ఎప్పుడూ ఏకగ్రీమేనని, అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి పులివెందుల జడ్.పి.టి.సి. స్థానానికి 11 నామినేషన్లు దాఖలు అవ్వడం జరిగిందన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరుగుచున్నాయని అంటానికి ఇదే నిదర్శనమని ఆమె తెలిపారు.

# మువ్వన్నెల జెండా ఓ ఉద్వేగం...ఓ స్ఫూర్తి





**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** కుల, మత, ప్రాంత, భాషా భేదం లేకుండా దేశమంత ఒకటే అనే జాతీయ భావన పెంపొందించడమే హర్ ఘర్ తిరంగా లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తిరంగా అంటే కేవలం ఇంటిపై జెండా ఎగరేయడం కాదని, దేశభక్తిని పెంచే సంకల్పమన్నారు. సోమవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. ముందుగా జాతీయ పతాకం రూపకర్త పింగళి వెంకయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం పింగళి వెంకయ్య జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ...గతంలో ఈ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అనేక కార్యక్రమాలకు నేను హాజరయ్యానని, కానీ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొనడం ఆనందాన్నిస్తోందని అన్నారు. ఏ జెండా చూస్తే ప్రతి భారతీయ పౌరుడి మనసు పులకరిస్తుందో, ఏ జెండా చూస్తే దేశం యావత్తు గర్వంగా తలెత్తుకుంటుందో, ఏ జెండా చూస్తే ఉద్వేగం కలుగుతుందో అదే మువ్వన్నెల జెండా' అని అన్నారు.

**పింగళి తెలుగువారు కావడం గర్వంగా ఉంది :** 'ప్రపంచంలోనే అతి శక్తివంతమైన జాతీయ జెండాను మన తెలుగు వ్యక్తి పింగళి వెంకయ్య రూపొందించడం మనందరికీ గర్వకారణం. జెండా అంటే కేవలం ఒక వస్త్రం కాదు. మన దేశ గౌరవం. జాతీయ జెండా చూడగానే మనందరిలో ఉద్వేగం, దేశభక్తి కలుగుతుంది. ఎందరో మహానుభావులు తెలుగునేలపై జన్మించారు. వారి పోరాటపటిమతో మనలో జాతీయస్ఫూర్తిని రగిలించారు. 1857లో ప్రథమ స్వాతంత్ర్య పోరాటం జరగ్గా అంతకముందే బ్రిటీష్ వారిపై తెలుగు వారు పోరాటం చేశారు. బ్రిటీష్ వారిని గడగడలాడించిన అల్లూరి సీతారామరాజు, తుపాకీ గుళ్లకు గుండె చూపించిన టంగుటూరి, గొట్టిపాటి బ్రహ్మయ్య, సర్దార్ గౌతు లచ్చన్న, దుగ్గిరాల గోపాల కృష్ణయ్య వంటి స్వాతంత్ర్య సమరయోధులు తెలుగు గడ్డపై పుట్టడం మన అదృష్టం' అని అన్నారు.

**సమగ్రత విషయంలో దేశం ఎవరికీ తలవంచదు:** 'దేశ సమగ్రత విషయంలో భారత్ ఎవరికీ తలవంచదు. దేశ క్షేమం, భద్రత విషయంలో మనమంతా ఒకటే. కార్గిల్ యుద్ధం, పహల్గామ్ ఘటన జరిగినప్పుడు దేశ ప్రజానీకం ఒక్క తాటిపై నిలిచింది. నేడు ఉన్నది ధృఢమైన భారతదేశం. విశ్వగురువుగా అవతరిస్తున్న భారతదేశం. ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదానికి గట్టిగా బదులిచ్చాం. ఉగ్రవాదుల గుండెల్లో సైనికులు రైళ్లు పరుగెత్తించారు. ఉగ్రవాదంపై అలుపెరుగని పోరాటం చేస్తున్న మన సైనికులకు సెల్యూట్ చేస్తున్నా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**భారత్‌ది గుడ్ ఎకానమీ :** 'ప్రధాని మోదీ రూపంలో మన దేశానికి సమర్థవంతమైన నాయకత్వం లభించింది. ఒకప్పుడు మనది పేద దేశం అనేవాళ్లు. 11 ఏళ్ల మోదీ పాలనలో 11వ స్థానంలో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థ 4వ స్థానానికి వచ్చింది. 2028కి 3వ స్థానానికి చేరుతుంది. 2047లో వందేళ్ల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకునే నాటికి ప్రపంచంలోనే శక్తివంతంగా మనదేశం నిలుస్తుంది 2047 నాటికి దేశంలో ఏపీ నెంబర్ వన్ రాష్ట్రం కావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మనది డెడ్ ఎకానమీ అన్నారు. ఎవరిది డెడ్ ఎకానమీనో భవిష్యత్ నిర్ణయిస్తుంది. మనపై సుంకాలు వేయడం తాత్కాలికమే. మనది గుడ్ ఎకానమీ. మన భారతీయుల సేవలు ప్రపంచానికి చాలా అవసరం. తెలుగుబిడ్డ పీవీ నరసింహారావు 1991లో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చారు. 1995లో ఐటీ విప్లవం వచ్చింది. దాన్ని మనం అందిపుచ్చుకుని ముందుకెళ్లాం. ఐటీని ప్రమోట్ చేసేందుకు హైటెక్ సిటీ కట్టాం. నేడు ఏపీలో క్వాంటమ్ వ్యాలీ తీసుకొస్తున్నాం. యువత ఎక్కువగా ఉండే దేశం మనది. అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని స్థిరమైన అభివృద్ధి సాధించే దిశగా ముందుకు వెళదాం'అని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు.

# చేనేతలకు చేయూత... కూటమి ప్రభుత్వ లక్ష్యం



**మచిలీపట్నం(జర్నలిస్ట్ ఫైల్):** మనిషికి సంస్కృతిని నేర్పిన చేనేత వృత్తిని కాపాడుకోవడానికి ప్రభుత్వం నిత్యం తపిస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నంలోని చిన్నాపురం గ్రామంలో చేనేత కార్మికులతో కలిసి 100 అడుగు చీరతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు హ్యాండ్ లూంకు 200 యూనిట్లు, పవర్ లూంకు 500 యూనిట్ల విద్యుత్ సబ్సిడీ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం చేనేత కాలనీలో బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ.. చేనేత కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు హ్యాండ్ లూమ్‌కు 200 యూనిట్లు, పవర్ లూమ్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అము చేసినందుకు రాష్ట్ర వ్యాప్తంగా చేనేత వర్గాలు ధన్యవాదాలు తెలుపుతూ ర్యాలీలు నిర్వహించడం సంతోషంగా ఉంది.

రాష్ట్రం గత ఐదు సంవత్సరాలు ఎదుర్కొన్న గడ్డు పరిస్థితుల నుండి అభివృద్ధి బాటలో నడిపించుకుంటున్నాం. దేశ చరిత్రలోనే కనీ వినీ ఎరుగని రీతిలో 94శాతం సీట్లు సాధించుకున్నాం. ప్రజలు నమ్మి అందించిన అధికారాన్ని ప్రజల సంక్షేమం కోసమే వినియోగిస్తామని భరోసా ఇస్తూముందుకు సాగుతున్నాం.

గతంలో రాష్ట్ర ఆస్తుల్ని అమ్మి, తాకట్టు పెట్టి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. చివరికి మద్యం భవిష్యత్ ఆదాయాన్ని కూడా తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారు. ఆదాయం లేక అవస్థలు పడుతున్నప్పటికీ.. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం. చేనేత కార్మికులకు హ్యాండ్ లూం కార్మికులకు 200 యూనిట్లు, పవర్ లూం కార్మికులకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. యాంత్రీకరణ పెరిగిపోవడంతో చేనేత కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి ఇబ్బందుల్ని గుర్తించి.. చేనేత కార్మికులకు చేనేత భరోసా ద్వారా ప్రతి సంవత్సరం రూ. 25 వేల చొప్పున ఇవ్వబోతున్నాం. అదే సమయంలో త్రిఫ్ట్ ఫండ్ కూడా పున:ప్రారంభించనున్నాం. పాత బకాయిలు రూ. 5 కోట్లు కూడా చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

మనిషికి సంస్కృతిని పరిచయం చేసింది చేనేతలే. అలాంటి వృత్తిని కాపాడుకోవడం కోసం ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా నిలుస్తుంది. అదే సమయంలో చేనేతలను ఆదుకోవడం కోసం ప్రతి శనివారం చేనేత వస్త్రాలు మాత్రమే ధరించాలని ముఖ్యమంత్రిగారు సూచించారు. మన ప్రాంతంలో అత్యంత ప్రజాదారణ కలిగిన కలంకారీ వస్త్రాలకు మార్కెటింగ్ పెంచాలి. మన కార్మికులు నేసిన వస్త్రాలను సొసైటీలకు ఇస్తున్నారు. సొసైటీలకు బకాయిలు పేరుకుపోవంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. 2014–19 మధ్య కాలంలో చేనేత సొసైటీ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశాం. సొసైటీలకు ఉన్న బకాయిలను కూడా రద్దు చేశాం. గత ఐదేళ్లు చేనేత కార్మికులకు అందాల్సిన సదుపాయాలు, ఇన్సూరెన్స్, థ్రిఫ్ట్ ఫండ్ నిలిపివేశారు. కూటమి అధికారంలోకి రాగానే సొసైటీలకు ప్రాధాన్యం కల్పిస్తోంది. మన జిల్లాలో రూ. 10 కోట్ల వరకు బకాయిలున్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 100 కోట్ల వరకు బకాయిలున్నాయి. వాటన్నింటినీ చెల్లించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చారు.

చేనేత రంగంలోకి కొత్త వారు రావడం లేదు. యువతకు చేనేతపై శిక్షణ ఇచ్చేందుకు అవసరమైతే ఇక్కడే శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాను. గతంలో తెలుగు రాష్ట్రాలలోని చేనేత వృత్తిని అనేక ప్రాంతాల్లో పరిశీలించాను. అంతకు మించిన క్లస్టర్లను ఇక్కడే ఏర్పాటు చేసేలా నేను కృషి చేస్తాను. మన బందరు చీరలకు ప్రపంచ స్థాయిలో బ్రాండింగ్ కల్పించేందుకు ప్రభుత్వం నుండి కావాల్సిన మద్దతు కూడగడదాం అన్నారు.

బడుగు బలహీన వర్గాలకు ఎప్పుడూ అండగా నిలిచేది తెలుగుదేశం ప్రభుత్వం మాత్రమే. అర్హులైన మత్స్యకారులకు రూ20 వేల చొప్పున ఆర్థిక సాయం అందించాం. గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం, బార్లలో 10 శాతం కేటాయించాం. లైసెన్సు ఫీజులో కూడా సగం సబ్సిడీ కల్పించాం. నాయీ బ్రాహ్మణుల సెలూన్లకు విద్యుత్ సబ్సిడీని 200 యూనిట్లకు పెంచాం. కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందించడం ద్వారా బడుగు బలహీన వర్గాల వారిని పారిశ్రామిక వేత్తలుగా మార్చేందుకు కట్టుబడి పని చేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.

# నేతన్నల జీవితాల్లో వెలుగులు






**మంగళగిరి టౌన్ (జర్నలిస్ట్ ఫైల్):** నేతన్నలను కార్పొరేట్ వ్యాపారుస్తులుగా తయారు చేయడమే మంత్రి నారా లోకేష్ ధ్యేయమని చేనేత నాయకులు పేర్కొన్నారు. చేనేత రంగాన్ని పెద్దఎత్తున ప్రోత్సహిస్తూ చేనేతల ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో వారికి ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతగా ధన్యవాదాలు తెలుపుతూ మంగళగిరి పట్టణంలో చేనేత వృత్తి దారులు, కళాకారులు, చేనేత కుటుంబ సభ్యులు, మహిళలు సోమవారం ఉదయం 100 అడుగుల చీరతో భారీ ర్యాలీ నిర్వహించారు. పాతమంగళగిరి శ్రీ భద్రావతి సమేత శ్రీభావనారుషి స్వామివార్ల దేవస్థానం వద్ద నుంచి హుస్సేన్ కట్ట, మిద్దె సెంటర్, మెయిన్ బజార్ మీదుగా శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యం పాలైన నేతన్నల జీవితాల్లో ఇప్పుడు వెలుగులు విరజిమ్ముతున్నాయని నేతన్నలు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో నేతన్నలకు ఇచ్చిన హామీలను ఏడాదిలోనే అమలు చేసి నేతన్నల నేస్తంగా కూటమి ప్రభుత్వం నిలిచిందన్నారు. యువనేత, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ 'యువగళం' పాదయాత్రలో చేనేత కుటుంబాల సమస్యలను ప్రత్యక్షంగా చూశారని, అందుకే వారికి నిత్య ఆదరణగా నిలిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. చేనేతలకు 200 యూనిట్లు, పవర్ లూమ్‌లకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్తు, రూ. 5 కోట్ల త్రిఫ్ట్ ఫండ్ కేటాయింపు చేనేత రంగానికి ఊతమిస్తాయన్నారు. రాష్ట్రంలో మగ్గాల మీద 50 వేల నేతన్నలు, మర మగ్గాలపై 11,500ల మంది ఆధారపడి జీవిస్తున్నా వారికి ఈ పథకం ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో తోడ్పాటు అందిస్తుందన్నారు. చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడానికి టాటా తనేరియా, ఆదిత్య బిర్లా గ్రూప్, తమిళనాడుకు చెందిన కో ఆప్టెక్తోనూ ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా 92,724 మంది నేతన్నలకు నెలకు రూ. 4 వేలకు పెన్షన్ను అందజేస్తున్నట్లు తెలిపారు. మొదటి ఏడాది పింఛన్ల రూపంలోనే రూ. 370.89 కోట్లు లబ్ధిదారులకు అందజేయడం జరిగిందన్నారు. చేనేతలకు త్రిఫ్ట్ పథకం కింద 2024–25లో రూ. 5 కోట్లు, 2025–26లో మరో రూ. 5 కోట్లు కేటాయించామన్నారు. క్యాష్ క్రెడిట్ కార్డులతో సహకార సంఘాలకు బ్యాంకు రుణాలు అందజేస్తున్నామని చెప్పారు. నేటి తరానికి అనుగుణంగా నూతన వస్త్రాల తయారీలో ఐదు జిల్లాల్లో నేతన్నలకు నైపుణ్య అభివృద్ధి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. తెలుగు వారి చేనేత వస్త్రాలను ప్రోత్సహించేందుకు దేశవిదేశాల్లో విక్రయాలకు పెంచేందుకు ప్రముఖ నగరాల్లో ఎగ్జిబిషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ముడి పదార్థాల సరఫరా పథకం నూలుపై 15 శాతం సబ్సిడీని ప్రభుత్వం అందజేస్తుంది. వ్యవసాయం తరువాత అత్యధికంగా ప్రజలు ఆధారపడ్డ చేనేత రంగం జగన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చేనేత రంగాన్ని నిర్వీర్యం చేయడంతో నేతన్నల ప్రతిభ మసక బారిందన్నారు. 2014–19వరకు టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన చేనేత పథకాలు, ఆర్థిక ప్రోత్సాహకాలు, రాయితీలను ఎత్తివేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులను సైతం పక్కదారి పట్టించిందన్నారు.

ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్‌చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ చేనేత వస్త్రాలను ప్రోత్సహిస్తున్న కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు సైతం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. 2019–24 మధ్య కాలంలో చేనేతలు అనేక రకాల ఇబ్బందులకు గురై అన్ని విధాలా నష్టపోయారన్నారు. నాడు నేతన్నలకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ అండగా నిలిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేతలను కార్పొరేట్ వ్యాపారస్తులుగా తయారు చేయడమే మంత్రి నారా లోకేష్ ధ్యేయం అని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్థికంగా, సామాజికంగా నేతన్నలకు అభివృద్ధి చేస్తామని భరోసా కల్పించారన్నారు. నేతన్నలకు 365 రోజులు ఉపాధి కల్పాంచాలన్న లక్ష్యంతో రూ. 10 వేల కోట్లతో నూతన టెక్స్టైల్స్ పాలసీని రూపొందించారన్నారు. ఆప్కో నేతృత్వంలో ఈ కామర్స్ ద్వారా నేరుగా వినియోగదారుల ఇళ్ల వద్దకే చేనేత వస్త్రాలను డెలివరీ చేసే విధంగా నూతన విధానానికి నాంది పలికినట్లు చెప్పారు. జాతీయ హ్యాండ్ లూమ్ అభివృద్ధి ప్రోగ్రాం కింద 2024–25లో 10 క్లస్టర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చేనేతలకు ఉచిత విద్యుత్ పథకం ద్వారా మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని అన్నారు. వీవర్స్ ముద్రా స్కీమ్ ద్వారా చేనేతలకు రుణాలు అందజేయడంతో పాటు గత ప్రభుత్వం నిలిపివేసిన త్రిఫ్ట్ నిధులను మళ్లీ అమలులోకి తీసుకొచ్చిన కూటమి ప్రభుత్వం 5,386 నేతన్నలకు రూ. 5 కోట్లను విడుదల చేసిందన్నారు. అంతేకాదు, చేనేత కుటుంబాలకు ఆరోగ్య బీమా పథకాన్ని వర్తింపజేయడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. మంగళగిరిలో మంత్రి నారా లోకేష్‌కు ఇచ్చిన మేజార్టీని దృష్టిలో పెట్టుకొని మంగళగిరి అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని వ్యాఖ్యానించారు.

టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు మాట్లాడుతూ నేతన్నల జీవితాలు నూలులోనే నలిగిపోకుండా, మగ్గంలోనే మగ్గిపోకుండా వారి అర్థిక అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని చెప్పారు. 11వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రారంభించిన పథకాలు చేనేత కుటుంబాల్లో ఆనందం నింపాయన్నారు. జాతీయ దినోత్సం రోజున మంత్రి నారా లోకేష్ చేనేతల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లగా వాటిని పరిగణలోకి తీసుకొని రాష్ట్రంలో ఉన్నటువంటి చేనేత కళాకారులకు కూటమి ప్రభుత్వం తరుపున కొన్ని సంక్షేమ పథకాలకు వాగ్ధానాలు చేయడంతో పాటు అమలు చేయడానికి కూడా నిర్ణయం తీసుకోవడం సంతోషించదగ్గ విషయం అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేనేతలకు అమలు చేయని సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. దేశంలో చేనేత పరిశ్రమ కోసం నిరంతరం పోరాడిన రాజ్యసభ మాజీ సభ్యుడు, చేనేత పితామహుడు ప్రగడ కోటయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని, టిడ్కో గృహసముదాయాల వద్ద నిర్మించే అతి పెద్ద పార్కుకు ప్రగడ కోటయ్య పేరు పెట్టాలని నిర్ణయించామనడం అలాగే ప్రగడ కోటయ్య జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని మంత్రి లోకేష్ ప్రతిపాదించగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటన చేయటం రాష్ట్రంలోని చేనేత వర్గాలకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల్లో ఉన్న చేనేత మహిళలకు రూ. 10 వేలు విలువ చేసే నూలును కూటమి ప్రభుత్వం అందజేసిందన్నారు. ఈ పథకం అమలు కోసం కూటమి ప్రభుత్వం ఏటా రూ. 125 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. దీనితో పాటు చేనేత విక్రయాలు పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా వీవర్స్ శాలలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

టీటీడీ పాలకమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి మాట్లాడుతూ 2024 సాధారణ ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేతన్నలకు మేలు కలిగేలా కూటమి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. 11వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలపై సీఎం చంద్రబాబు నాయుడు వారాల జల్లు కురిపించడం పట్ల చేనేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు చేనేతలకు మగ్గాలు ఉన్న వారికి 200 యూనిట్లు, మరమగ్గాలు ఉన్నవారికి 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ను అమలు చేయటం జరుగుతుందన్నారు. దీని వలన మగ్గాలు ఉన్న వారకి సంవత్సరానికి రూ. 15,000 వరకు, మరమగ్గాలు ఉన్న వారికి రూ. 30,000 వరకు ప్రభుత్వం అసరా అందింస్తుందన్నారు.

మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాకతో చేనేతల బతుకుల్లో వెలుగులు విరజిమ్ముతున్నాయని అన్నారు. చేనేతలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మంత్రి నారా లోకేష్ చొరవతో కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఉచిత విద్యుత్ పథకం, చేనేత వస్త్రాలపై అయిదు శాతం మినహాయింపు, త్రిఫ్ట్ నిధులు చేనేతల ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయన్నారు. నేతన్నలకు 365 రోజుల పాటు పని కల్పించడంతో పాటు వారి కుటుంబాలు గౌరవ ప్రదమైన జీవనం సాగించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ప్రణాళికలు అమలు చేస్తున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో చేనేత వృత్తి దారులు, కళాకారులు, చేనేత కుటుంబ సభ్యులు, టీడీపీ, జనసేన, బీజేపీ నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆన్‌లైన్‌లో ఇందిరమ్మ ఇళ్ల తనిఖీ

## సులభంగా నిర్మాణ పురోగతి తెలుసుకునే అవకాశం

**హైదరాబాద్, ఆగస్టు 11(జర్నలిస్ట్‌ఫైల్):** ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులకు గుడ్‌న్యూస్. ఇకపై ఇళ్ల నిర్మాణం ఏస్థాయిలో ఉంది, బిల్లుల చెల్లింపు తదితర వివరాలు ఈజీగా ట్రాక్ చేయవచ్చు. ఆ వివరాలు పూర్తిగా ఆన్‌లైన్‌లో అందు బాటులో ఉంటాయి. పారదర్శకతను పెంచే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల వెబ్‌సైట్‌లో అధికారులు మార్పులు చేశారు. లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, తమ వివరాలను తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ, హిందీ భాషల్లో సులభంగా చూసుకోవచ్చు.ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులకు శుభవార్త. ఇకపై ఇంటి నిర్మాణ పురోగతి, బిల్లుల చెల్లింపు వంటి సమగ్ర వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండనున్నాయి. ప్రభుత్వం పారదర్శక తను పెంచే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఇందిరమ్మ ఇండ్ల వెబ్‌సైట్‌లో మార్పులు చేసి, లబ్ధిదారుల సమాచారాన్ని నేరుగా చూసుకునే వీలు కల్పించినట్లు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. ఈ సౌకర్యం వల్ల లబ్ధిదారులు ఇకపై కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. కార్యాలయాల చుట్టూ తిరిగేందు సమయం, డబ్బులు వృథా అవుతుండగా.. ఆ సమస్యకు చెక్ పెట్టేందుకు వెబ్‌సైట్‌లో మార్పులు చేశారు.ప్రజల సౌకర్యార్థం ఈ వెబ్‌సైట్‌లో సమాచారం తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ, హిందీ భాషల్లో అందుబాటులో ఉంచారు. దీనివల్ల భాషాపరమైన సమస్యలు లేకుండా ప్రజలు సులభంగా తమ వివరాలను తెలుసుకోవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3 లక్షల ఇళ్లను ఇందిరమ్మ పథకం కింద మంజూరు చేయగా.. వాటి నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. మార్క్ అవుట్, పునాదులు, గోడలు, స్లాబ్ వంటి నిర్మాణ పనుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. ఈ సమాచారం ఆధారంగానే లబ్ధిదారులకు నాలుగు విడతలుగా రూ.5 లక్షల ఆర్థిక సాయం విడుదల చేస్తున్నారు.తమ ఇంటి నిర్మాణ బిల్లు ఏ స్థాయిలో ఉంది? ఏ అధికారి వద్ద ఆగిపోయింది? వంటి వివరాల కోసం లబ్ధిదారులు గతంలో హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయాలు, కలెక్టరేట్లు, ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ సమాచారం అంతా ఆన్‌లైన్‌లోనే లభిస్తుంది. బిల్లు ఏ కారణంతో ఆగి పోయిందో కూడా తెలుసుకునే వీలు ఉండటంతో, లబ్ధిదారులు ఆ లోపాలను సరిదిద్దుకునే అవకాశం ఉంటుంది. లబ్ధిదారులు తమ వివరాలు తెలుసుకు నేందుకు ఇందిరమ్మ ఇల్లు అనే వెబ్‌సైట్‌లో అప్లికేషన్ బటన్‌పై సెర్చ్ చేయాలి. అనే వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. ఇందిరమ్మ ఇల్లు అనే వెబ్‌సైట్‌లో అప్లికేషన్ సెర్చ్ బటన్‌పై క్లిక్ చేయాలి. ఆ తర్వాత సెర్చ్ బై ఆప్షన్‌లో ఆధార్ లేదా మొబైల్ నెంబర్ వంటి వివరాలను ఎంచుకోవాలి. వివరాలు నమోదు చేయగానే, స్క్రీన్‌పై లబ్ధిదారుని పూర్తి సమా చారం, ఇంటి నిర్మాణ పురోగతి, బిల్లుల చెల్లింపు తేదీలు, చెల్లించిన మొత్తం వంటి వివరాలు కనిపిస్తాయి. అంతేకాకుండా, లబ్ధిదారుల సమాచారంలో ఏవైనా లోపాలు ఉంటే, అవి కూడా వెబ్‌సైట్‌లో కనిపిస్తాయి. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసుకోవాలని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ విపి గౌతమ్ సూచించారు.

# సిద్దిపేటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ

## సిఎం రేవంత్‌రెడ్డితో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భేటీ

**(జర్నలిస్ట్‌ఫైల్) ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 11:** రైతాంగం అంశాలపై కేంద్రం మొండిగా వ్యవహరిస్తోంది, వ్యవసాయరంగానికి సంబంధించిన సమస్యలపై విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఫామాయిల్ పంటల దిగుబడి గణనీయంగా ఉన్నందున కొన్ని చోట్ల ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీలను ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు మంత్రి తుమ్మల సిఎంకు వివరించారు. అశ్వరావుపేట, సిద్దిపేట జిల్లాలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ఏర్పాటుకు వీలుగా ఏదో ఒక చోట ప్రారంభోత్సవానికి రావాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. దాంతో 15 ఆగస్టు త్వరాత సిద్దిపేట జిల్లాలో ఏర్పాటుచేసే కార్యక్రమానికి హాజరవుతానని సిఎం రేవంత్‌రెడ్డి మంత్రి తుమ్మలకు స్పష్టత ఇచ్చారు. అదేవిధంగా మిగతా అంశాలపై త్వరలోనే చర్చించి నిర్ణయం తీసుకుందామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిసింది.

# 18, 19న చలో ఢిల్లీ.. ఒబిసిల జాతీయ సదస్సు

## రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, ఆగస్టు 11(జర్నలిస్ట్‌ఫైల్):** బిసిలకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఒబిసి జాతీయ సెమి నార్లు జరపాలని ఈ నెల 18, 19న చలో ఢిల్లీ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపి, జాతీయ బీసీ సంఘం అధ్యకుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈ కార్య క్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల నుండి ప్రొఫె సర్లు, మేధావులు ఈ సెమినార్‌లో 8 మంది కేంద్రమంత్రులు, 20 మంది వివిధ పార్టీలకు చెందిన పార్లమెంట్ సభ్యులు పాల్గొంటారని ఆదివారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తొలిసారిగా జనగణనలో కులగణన చేపడుతుంది. ఇది దేశచరిత్రలో రికార్డు, 76 సంవత్సరాల చరిత్రలో ఏ పార్టీ కూడా కులగణన చేయలేదు. కులగణన తర్వాత బిసిలకు అన్ని రంగాల్లో ముఖ్యంగా ఆర్థిక, రాజకీయ, సామజిక, విద్యా, ఉద్యోగ రంగాలలో జనాభా ప్రకారం వాటా లభిస్తుంది. అన్ని కోణాలలో కులగణన తర్వాత సమాజంలో విప్లవాత్మకమైన మార్పు వస్తుందన్నారు. 75 కోట్లకుపైగా ఉన్న బీసీ వర్గాల చిరకాల కులగణన డిమాండ్‌ను కేంద్రం గౌరవించినట్లుగా ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంపై ప్రధానమంత్రి నరేంద్రమోడీకి ధన్య వాదాలు తెలిపారు. పార్లమెంట్‌లో బిసి బిల్లుపెట్టి అసెంబ్లీ పార్లమెంట్ ఎన్ని కలలో 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలి. కేంద్రంలో బిసిలకు ప్రతేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేసి 2 లక్షల కోట్లతో ప్రతేక అభివృద్ధి పథకం ప్రకటించాలి. బిసిల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను 25 శాతం నుంచి 50 శాతం పెంచాలి. బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి. ఈ మేరకు రాజ్యాంగాన్ని సవరించాలి. బిసిల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై యున్న క్రిమిలేయర్‌ను తొలగించాలి. బి.సిలకు పారిశ్రామిక పాలసీలో 50 శాతం కోటా ఇవ్వాలి. హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జిల నియమాకంలో ఎస్సీ/ఎస్‌టి/బిసి రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలి. ప్రైవేటు రంగంలో ఎస్సీ/ఎస్‌టి/బిసిలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని అన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్, ఆర్వీ మహేందర్, రాజేష్ తదితరులు

# సమగ్ర కులగణనలో మున్నూరుకాపును తక్కువగా చూపారు

## రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కొండా దేవయ్యపటేల్

**హైదరాబాద్, ఆగస్టు 11(జర్నలిస్ట్‌ఫైల్):** సమగ్ర కులగణనలో మున్నూరు కాపులను కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువజేసి చూపించిందని, రాష్ట్ర వ్యాప్తంగా సభ్యత్వ నమోదుతో తమ బలం, బలగాన్ని చాటుతామని తెలంగాణ మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొండా దేవయ్య పటేల్ అన్నారు. ఈమేరకు ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర వ్యాప్త సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే కేంద్ర న్యాయ శాఖ మాజీ మంత్రి, బీసీల నేత పుంజాల శివశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా కొండా దేవయ్య పటేల్ మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 40 లక్షలకు పైగా ఉన్న మున్నూరుకాపులను కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా తక్కువ చేసి చూపించిందన్నారు. తప్పుల తడకగా చేసిన కుటుంబ సర్వే వల్ల మున్నూరుకాపులు బీసీ జానాభాలో ఐదో స్థానానికే పరిమితమయ్యారన్నారు. ఫలితంగా విద్య, ఉద్యోగ, రాజకీయంగా తీవ్రంగా నష్టపోయామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పది మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాజ్యసభ సభ్యులకు అవకాశం కల్పించారని, కాని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొక్కుబడిన సీట్లు కేటాయించడంతో పాటు కనీసం మంత్రి పదవీ కూడా ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతామని, తద్వారా మున్నూరుకాపుల సమగ్ర సర్వే నిర్వహిస్తామన్నారు.తమ సభ్యత్వ నమోదు కార్యక్రమం కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంప పెట్టుకానుందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు చేయమంటే ఢిల్లీకి పోయి ధర్నాలు చేస్తున్నారని, సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలన్నారు. రాబోవు స్థానిక ఎన్నికల్లో మున్నూరుకాపులు అత్యధికంగా పోటీ చేయాలని సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ పేరు చివరన పటేల్ అని రాయాలని సూచించారు. ఈ సమావేశంలో తెలంగాణ మున్నూరుకాపు సంఘం గ్రేటర్ అధ్యక్షులు ఆర్వీ మహేందర్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. రాజేశ్, సతీశ్, వెంకటేశ్ పటేల్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# దసరా తర్వాత సింగరేణి యాత్ర చేస్తా

## కెటిఆర్‌కు రాఖీ ఎందుకు కట్టలేదంటే.. కల్వకుంట్ల కవిత దాటవేత

**(జర్నలిస్ట్‌ఫైల్)ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 11:** మాజీ మంత్రి కేటీఆర్‌తో గ్యాప్‌పై మాట్లాడటానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇష్టపడలేదు. కేటీఆర్‌కు రాఖీ ఎందుకు కట్టలేదనే మీడియా ప్రశ్నకు సమాధానం చెప్పకుండా ఆమె దాటవేశారు. బీఆర్ఎస్‌పైనే ఎందుకు ఫోకస్ చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ఒక మాట, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మరోమాట మాట్లాడుతారని ఎద్దేవా చేశారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌కు బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ వార్నింగ్ ఇచ్చినా.. బీజేపీ హై కమాండ్ ఎందుకు చర్చించలేదని ప్రశ్నించారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘానికి తాను గౌరవ అధ్యక్షురాలిగా ఉన్నానని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. రాబోయే రోజుల్లో లెఫ్ట్ సంఘాలతో కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు. ఈసారి సింగరేణి కార్మికులకు దసరా బోనస్‌ను 37శాతం ఇవ్వాలని రేవంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి లాభాలను ఎందుకు తక్కువ చేసి చూపిస్తోందని కవిత ప్రశ్నించారు. దసరా తర్వాత సింగరేణి యాత్ర చేస్తాననని ప్రకటించారు సింగరేణి కార్మికులకు భరోసా కల్పించేందుకే ఈ యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. కార్మికుల సమస్యలపై హెచ్ఎంఎస్‌తో కలిసి అలయన్స్‌గా పనిచేస్తామని వెల్లడించారు.

# ప్రజల ఆరోగ్యానికి కేంద్రం పెద్దపీట

## రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్‌ను తిరిగి ప్రవేశపెట్టాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో కలిసి పిఎంబిఐని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్ (తార్నాక), ఆగస్టు 11(జర్నలిస్ట్‌ఫైల్):** కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. ఆదివారం ఉప్పల్‌లోని ఇండస్ట్రియల్ ప్రాంతంలో ప్రధాన మంత్రి భారతీయ జనౌషది పరియోజన తెలంగాణ మార్కెటింగ్ కం డిస్ట్రిబ్యూషన్ వేర్ హౌజ్‌ను లార్విన్ ఫార్మా అండ్ సర్జికల్స్ సంస్థ సహకారంతో ఉప్పల్ ఇండస్ట్రియల్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన పీఎంబీజేపిని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఎంపీ ఇటల రాజేందర్‌తో కలిసి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ఆయుష్మాన్ భారత్ విషయంలో గత ప్రభుత్వం నిరక్ష్యం చేసి వెళ్లి పోయిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభు త్వం అయినా ఆయుష్మాన్ భారత్‌ను తెలంగాణలో ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని జనౌషధ కేంద్రాలకు మెడికల్ డిపోగా ఉప్పల్లో ప్రధాన మంత్రి భారతీయ జనౌషధ పరియోజన తెలంగాణ మార్కెటింగ్ కమ్ డిస్ట్రిబ్యూషన్ వేర్ హౌస్‌ను ఏర్పాటు చేసుకున్నామని తెలి పారు. మోడీ ప్రభుత్వం 70 సంవత్సరాలు నిండిన వృద్ధులకు, ఆస్తితో, పెన్షన్‌తో సంబంధం లేకుండా రూ. 5 లక్షల వరకు ఏ రాష్ట్రంలోనైనా, ఏ నగరంలోనైనా కోరుకున్న హాస్పిటల్లో వైద్యం చేయించుకునేవిధంగా ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశ పెట్టిందని కిషన్‌రెడ్డి చెప్పారు. మార్కెట్‌లో ఉన్న మెడిసిన్ ధరలతో పోల్చితే జనౌషధ కేంద్రాలలో 50 శాతం నుంచి 90 శాతం వరకు తక్కువ ధర ఉంటుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆయూష్మాన్ భవను ప్రతి పేద వాడికి అందేలా చూడాలని డిమాండ్ చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మాట్లాడుతూ.. నాణ్యమైన ఆరోగ్య సేవలను ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తేవాలనే మన లక్ష్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా, పిఎంబిఐ-లార్విన్ జనఔషధి డిస్ట్రిబ్యూషన్ మార్కెటింగ్ వేర్‌హౌస్‌ను మీతో కలిసి ప్రారంభించుకోవడం నాకు ఎంతో ఆనందం కలిగిస్తోంది. ప్రధానమంత్రి భారతీయ జనఔషధి పరియోజన మన ప్రభుత్వంలోని అత్యంత ప్రభావవంతమైన ప్రజా ఆరోగ్య కార్యక్రమాలలో ఒకటి నాణ్యమైన జనరిక్ మందులను తక్కువ ధరకే అందించడం జరుగుతుందన్నారు. ఇది రాష్ట్రానికి గర్వకారణమైన రోజు అన్నారు. ఉప్పల్‌లో ఈ ఆధునిక వేర్‌హౌస్ ప్రారంభంతో రాష్ట్రంలోని ప్రతి మూలకూ తక్కువ ధరలో మందులు వేగంగా, సమర్థవంతంగా చేరేలా చేసే బలమైన సరఫరా వ్యవస్థను ఏర్పరుస్తున్నామని చెప్పారు. జనఔషధి మందుల పంపిణీ బాధ్యతను తెలంగాణలో ముందుకు తీసుకెళ్తున్న యువ, చురుకైన పారిశ్రామికవేత్త వరుణ్ విహార్ మడుపడుగ, లార్విన్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్, అలాగే రాము మడుపడుగ, లార్విన్ గ్రూప్ సిఇఒకు హృదయ పూర్వక అభినందలను అన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి చేస్తున్న కృషిని కూడా నేను అభినందిస్తున్నానని చెప్పారు.

ఈ సదుపాయం సుమారు 3,000 ముఖ్యమైన మందులు శస్త్రచికిత్సా వస్తువుల సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. తక్కువ ధరలో మందులు అందుకోవడం ప్రత్యేక హక్కు కాదు, అది ప్రతి ఒక్కరి హక్కు అని అన్నారు.

# రాజగోపాల్‌రెడ్డి అంశం మా దృష్టికి రాలేదు

## కొండా మురళి లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు

### పిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి

### కాంగ్రెస్ పార్టీనే తమ రక్తంలో ఉంది: కొండా మురళి

### గాంధీభవన్‌లో క్రమశిక్షణా సంఘం సమావేశం

**హైదరాబాద్, ఆగస్టు 11(జర్నలిస్ట్‌ఫైల్):** టిపిసిసి క్రమశిక్షణ కమిటీ సమావేశం ఆదివారం గాంధీభవన్‌లో నిర్వహించారు. క్రమ శిక్షణ కమిటీ చైర్మన్, ఎంపి మల్లు రవి అధ్యక్షతన దాదాపు రెండుగంటల పాటు ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలపై చర్చ చేశామని, భవిష్యత్తులో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు, అన్నింటిలో కలసి పని చేయడానికి ఒప్పుకున్నారన్నారు. నేతలు కలిసి పనిచేయడానికి ఒక నిర్ణయానికి వచ్చారని అన్నారు. అనిరుధ్ రెడ్డి అంశంపై చర్చించ్చినట్లు, రాజగోపాల్ రెడ్డి అంశంపై చర్చ జరగలేదన్నారు. రాజగోపాల్‌రెడ్డి ఇష్యూ కమిటీ దృష్టికి రాలేదని పేర్కొన్నారు. కొండా మురళి లిఖితపూర్వకంగా సమాచారం ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్యేలు కూడా లిఖిత పూర్వకంగా సమాచారం ఇచ్చారని వివరించారు.కాంగ్రెస్ నేత కొండా మురళి పిసిసి క్రమశిక్షణా కమిటీ ముందు హాజరయ్యారు. ఆయన ఇప్పటికే ఒకసారి హాజరై వివరణ ఇచ్చారు. ఇటీవల ఓ కార్యక్రమంలో వరంగల్‌లోని నేతలను ఉద్దేశించి కొండా మురళి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయన్ను గతంలో పిసిసి క్రమశిక్షణ కమిటీ గాంధీ భవన్‌కు పిలిచి వివరణ కోరింది. దీనిపై లిఖిత పూర్వక వివరణ కోసం మళ్లీ షోకాజ్ నోటీసు కూడా ఇచ్చింది. ఈక్రమంలో ఆయన కమిటీ ముందు ఆదివారం మరోసారి హాజరై లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. అనంతరం కొండా మురళి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీనే తమ రక్తంలో ఉందన్నారు.పార్టీ ఏ ఆదేశమిచ్చినా తప్పక పాటిస్తామని తెలిపారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే తమ లక్ష్యమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరం కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు. క్రమశిక్షణ కమిటీ అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చినట్లు కొండా మురళి తెలిపారు.



# వ్యవసాయ మార్కెట్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం

## రూ.70 లక్షల విలువైన 7లక్షల గన్ని సంచులు దగ్ధం?

### ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించిన ఎస్పీ అశోక్‌కుమార్, డిఎం జితేంద్రప్రసాద్

**మెట్‌పల్లి, (జర్నలిస్ట్‌ఫైల్)** మెటుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో పాత గన్ని సంచుల గోదాంలో ఆదివారం ఉదయం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకోగా..సుమారు రూ.70 లక్షల విలువ గల 7లక్షల పాత గన్ని సంచులు దగ్ధం అవగా..రాత్రి 8 గంటల వరకు ఫైర్ అధికారి కృష్ణకాంత్ ఆధ్వర్యంలో,ఫైర్ సిబ్బంది మూడు ఫైర్ ఇంజన్ ల సహాయంతో గోదాంలో సంచులకు అంటుకున్న అగ్నిని ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు.వివరాల్లోకి వెళితే..గోదాం ఇంచార్జి బూరం సురేష్ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో గల పురాతన గన్ని సంచుల గోదాంలో ఆదివారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో మంటలు చెలరేగిన విషయమై స్థానికులు సమాచారమిచ్చిన వెంటనే..పోలీసులకు అగ్నిమాపక సిబ్బందికి గోదాం అధికారులు సమాచారం అందించారు.దీంతో మూడు ఫైర్ ఇంజన్ లు,మున్సిపల్ వాటర్ ట్యాంకర్ సహాయంతో,గోదాంకు ఉన్న కిటికీ ప్రాంతంలో గోడను జేసీబీ సహాయంతో తొలగించి మంటలను ఆర్పే ప్రయత్నం రాత్రి వరకు కొనసాగుతుంది.కాగా గత 7 ఏళ్లుగా గోదాంలో వాడకానికి పనికిరాని 9 లక్షల గన్నీ సంచులు ఉండగా,వాటిలో సిబ్బంది సహాయంతో సుమారు 2లక్షల వరకు బయటకు తీసామని,దగ్ధం అయిన సంచుల విలువ సుమారు రూ.70 లక్షల వరకు ఉంటుందని గోదాం ఇంచార్జి సురేష్ తెలిపారు. ఈ అగ్నిప్రమాదం ఘటనలో ఇంకా భారీ నష్టం జరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గోదాంలోని ఎలాంటి విద్యుత్ సరఫరా లేకపోగా..మూసి ఉన్న గోదాంలో అగ్నిప్రమాదం జరగడం వెనుక కారణం మాత్రం ఎవరికి అంటుపట్టడం లేదన్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, సివిల్ సప్లై డిఎం జితేంద్ర ప్రసాద్,ఆర్డీవో శ్రీనివాస్ మెట్పల్లి డీఎస్పీ రాములు, తహసీల్దార్ నీత,సిఐ అనిల్ కుమార్,మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ లు పరిస్థితిని పరిశీలిస్తున్నారు.

# దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

### జిఒ 34 విడుదలపై దివ్యాంగుల ఉద్యోగ సంఘాల నేతల హర్షం

**హైదరాబాద్, ఆగస్టు 11(జర్నలిస్ట్‌ఫైల్):** దివ్యాంగుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నామని, దివ్యాంగుల కుటుంబాలు, వారి తల్లితండ్రుల కళ్లలో ఆనందం చూడటమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. దివ్యాంగుల ఉద్యోగ సంఘం నేతలు ఆదివారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యని గజమాలతో ఘనంగా సత్కరించారు. డిఫరెంట్లీ ఏబుల్డ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దివ్యాంగుల ఉద్యోగుల బదిలీల్లో రిజర్వేషన్‌లు కల్పిస్తూ మాన సిక దివ్యాంగుల కుటుంబాలకు కూడా వర్తింపచేస్తూ ప్రభుత్వం జి.ఓ.నెంబరు 34 విడుదల చేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి మాట్లాడుతూ దివ్యాంగుల స్వయంసమృద్ధి కోసం వేల సంఖ్యల్లో దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని, ఈ సంఘాలకి ఆర్థికంగా ఊతం ఇస్తూ, వారిని వ్యక్తిగతంగా ఆర్థికంగా వృద్ధిచెందేలా చేయడమే లక్ష్యంగా రుణాలి స్తున్నామని అన్నారు. రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ దివ్యాంగుల ఉద్యోగుల బదలీ విషయంలో గత ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందన్నారు. నేటి ప్రజాపాలన ప్రభుత్వంలో దివ్యాంగుల ఉద్యోగులకు బదలీల్లో రిజర్వేషన్ కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. మానసిక దివ్యాంగులున్నా కుటుంబసభ్యులుగా కలిగి ఉన్నా ఉద్యోగులకు కూడా అవకాశం కల్పించడం అనేది దేశ చరిత్రలోనే మొదటిసారి జరిగిందన్నారు.

# బడుగుల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్

## ఆయన్ని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలి: మంత్రి పొన్నం

### ఘనంగా పాపన్నగౌడ్ 375వ జయంతి వారోత్సవాలు




సభలో ప్రసంగిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, వేదికపై వి.రామారావుగౌడ్, మహేష్‌కుమార్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, జయదేవ్, భరత్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), ఆగస్టు (జర్నలిస్ట్‌ఫైల్)** సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ కేవలం గౌడ్‌లకే కాదు బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన గొప్ప పోరాట యోధుడని, ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకుపోవాలని బిసి సంక్షేమ, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న మహరాజ్ ధర్మ పాలన సంస్థ, జైగౌడ ఉద్యమం జాతీయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో వట్టి కూటి రామారావుగౌడ్ అధ్యక్షతన జరిగిన పాపన్నగౌడ్ 375వ జయంతి జాతీయ వారో త్సవాలకు ముఖ్య అతిథిగా వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్, పిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్‌గౌడ్, బిసి కార్పొరేషన్ అధ్యక్షుడు నూతి శ్రీకాంత్‌గౌడ్, మాజీ మంత్రులు వి.శ్రీనివాస్‌గౌడ్, జోగి రమేష్, ఎంపిలు భరత్‌గౌడ్, మధుయాష్కిగౌడ్, గుల్బర్గా ఎమ్మెల్సీ జయదేవ్‌గుత్తా, జైగౌడ తెలంగాణ అధ్యక్షుడు నారాయణగౌడ్, ఎపి అధ్యక్షుడు చిట్టి బొమ్మకిషోర్‌గౌడ్, కె.అశోక్‌గౌడ్ తదితరులతో కలిసి పాపన్న చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘననివాళులర్పించి ప్రసంగించారు. వృత్తిని కాపాడుకుంటూనే నేటి పోటీ ప్రపంచంలో మన పిల్లలు ఉన్నతవిద్యను అభ్యసించి ఉపాధి అవకాశాలు పెంచుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. హుస్నాబాద్ నియోజకవర్గం లోని సర్వాయిపేటలో పాపన్నగౌడ్ కోటకు 5 కోట్లు కేటాయించి అభివృద్ధి చేస్తా మని భరోసానిచ్చారు. అలాగే ఈ నెల 17న సైదాపూర్‌లో పాపన్నగౌడ్ విగ్ర హావిష్కరణ చేస్తున్నామన్నారు. కరీంనగర్‌లో పెద్ద గౌడహాస్టల్ నిర్మించా మన్నారు. గౌడ కులానికి చెందిన వ్యక్తిగా రాష్ట్రంలో అన్ని బలహీనవర్గాల సంక్షే మానికి అందరినీ కలుపుకుని పనిచేస్తానన్నారు. ఈ యేడాది 40 లక్షల మొక్కలు నాటి సంరక్షిస్తామని చెప్పారు. ప్రభుత్వ స్థలాలున్న చెరువుకట్టలపై ఈత మొక్కలు నాటామని, సర్వాయి పాపన్నగౌడ్ వారసులుగా వృత్తిని రక్షణ చేసుకోవాలని మంత్రి పిలుపు నిచ్చారు. పిసిసి ప్రధాన కార్యదర్శి డా. వట్టికూటి రామారావుగౌడ్ అధ్యక్షోపన్యాసం అనంతరం మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ పాపన్నగౌడ్ జయంతి వేడుకలను అన్నివర్గాల ప్రజలు జరుపుకోవాలని సూచించారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో కూరగాయల సేద్యం

## తొలిదశలో 4,500 కేంద్రాల్లో సాగు

**హైదరాబాద్, ఆగస్టు 11(జర్నలిస్ట్‌ఫైల్):** అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకునే పిల్లల ఆరోగ్యం,పోషణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వ పోషణ్ వాటిక పథకం కింద రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో కూరగాయల తోటలను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో 35,700 అంగన్వాడీ కేంద్రాలుండగా.. మొదటి విడతలో 4500 కేంద్రాల్లో టమాట, వంకాయ, దొండకాయ, పాలకూర, తోటకూర, మెంతికూరలను పండించేందుకు ప్రణాళిక సిద్ధం చేయగా.. వీటి విత్తనాలను జాతీయ విత్తనాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్సీ) పంపిణీ చేయనుంది. పెంపకం అనంతరం వీటిని లబ్దిదారుల వంటల కోసం వినియోగిస్తారు. ప్రస్తుతం ఈ కేంద్రాల్లో కూరగాయలను కొనుగోలు చేస్తున్నారు. కొన్ని సమయాల్లో వాటిలో నాణ్యత లోపించడం, వాతావరణ పరిస్థితులు కారణంగా అవి సకాలంలో సరైన అందుబాటులో లేకపోవడం, ఒకవేళ ఉన్నా అవి అందుబాటు ధరల్లో ఉండకపోవడంతో వాటిని ఆయా కేంద్రాల్లో చదువకునే పిల్లలకు అందించడం కష్టంగా మారింది. ఇటువంటి పరిస్థితులపై ప్రత్యేకంగా కేంద్రం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో పోషణ్ వాటిక పథకం అమలుపై సమీక్ష సందర్భంగా ఈ అంశాలన్నింటినీ చర్చించి అన్ని రాష్ట్రాల్లో ఈ పథకం చేపట్టాలని కేంద్రం సూచించింది. దీనికి అవసరమైన విత్తన కిట్లను తయారు చేసి రాష్ట్రాలకు పంపిణీ చేయాలని ఎన్ఎస్సీకి ఆదేశించింది. వీటిని అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తారు. రాష్ట్ర ఉద్యాన అధికారులు కేంద్రాలను సందర్శించి కూరగాయల సాగుకు అనువైన సౌకర్యాలు కల్పిస్తారు. విత్తనాలు వేసిన తర్వాత వాటి పెంపకాన్ని పర్యవేక్షిస్తారు. ఈ పథకం విజయవంతంగా అమలయితే ఆయా కేంద్రాల్లో ఉండే పిల్లలకు మంచి పోషణ లభించడమే కాకుండా వారికి నాణ్యమైన కూరగాయలను అందించినట్లు అవుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# 90 లక్షల ఎకరాలకు చేరిన ఖరీఫ్

**హైదరాబాద్, ఆగస్టు 11(జర్నలిస్ట్‌ఫైల్):** తెలంగాణలో మొత్తం ఖరీఫ్ విస్తీర్ణం 1.52 కోట్ల ఎకరాలు కాగా, ఇప్పటి వరకూ 90 లక్షల ఎకరాలకు సాగు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో 73.65 లక్షల ఎకరాల్లో సాగైంది. పత్తి, మొక్కజొన్న వంటి పంటలు స్థిరమైన పురోగతిని కనబరుస్తున్నాయి, అయితే, వరి నాట్లు మందకొడిగా సాగయ్యాయి. 66 లక్షల ఎకరాల లక్ష్యం కాగా, ఇప్పటివరకు కేవలం 35 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగయ్యాయి. అలాగే ఇప్పటివరకు 43.71 లక్షల ఎకరాల్లో పత్తి నాటగా, ఇది గత ఏడాది ఇదే సమయానికి సాగైన దాని కంటే 2.50 లక్షల ఎకరాలు ఎక్కువ. గత ఏడాది ఇదే సమయానికి 41.37 లక్షల ఎకరాలు వేశారు. అలాగే మొక్కజొన్న 5.52 లక్షల ఎకరాల్లో, సోయాబీన్ 35.58 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. అయితే కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పంప్ హౌస్‌లు పనిచేయకపోవడం వల్ల ఆయకట్టు కింద నీరు విడుదల చేయని సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో విత్తనాలు వేయడంలో ఇంకా వేగం పుంజుకోలేదు.

## ప్రజలు ఎల్లవేళలా సుఖసంతోషాలతో జీవించాలి

### ముత్యాలమ్మ జాతర మహోత్సవంలో పాల్గొన్న ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్



**విజయవాడ, ఆగస్టు 11(జర్నలిస్ట్‌ఫైల్):**

విజయవాడ, కస్తూరిబాయ్ పేట లో నిర్వహించిన ముత్యాలమ్మ జాతర పండుగ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు,తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ అవినాష్ పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ మన సంస్కృతీ సంప్రాదయాలకు ప్రతీకగా నిలిచే ఇలాంటి అమ్మవారి జాతరలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని, ప్రజలు ఎల్లవేళలా సుఖసంతోషాలతో ఉండలని ప్రార్థిస్తున్న అని అన్నారు.ఆ అమ్మవారి చల్లని ఆశీస్సులు ప్రజలందరి పై ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వియ్యపు అమర్నాథ్,వైసీపీ నాయకులు ఇజ్జడా తేజ,లంకా అబ్బి నాయుడు,సంపత్,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ ప్రశ్నలకు ఈసీఐ సమాధానం చెప్పాల్సిందే

### సీడబ్ల్యూసీ మెంబర్ గిడుగు రుద్రరాజు డిమాండ్

**విజయవాడ, ఆగస్టు 11(జర్నలిస్ట్‌ఫైల్):**



ఆంధ్రప్రదేశ్ సహా కర్ణాటక, మహారాష్ట్ర, హర్యానా మరియు ఇతర ప్రాంతాల్లో ఓటర్ల జాబితాలో పెద్ద ఎత్తున వ్యత్యాసాలకు సంబంధించి లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ లేవనెత్తిన ఐదు ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని సీడబ్ల్యూసీ మెంబర్, ఏపిసీసీ పూర్వ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు భారత ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఆరు నెలలుగా రాహుల్ గాంధీ నిరంతర దర్యాప్తులో భాగంగా దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా భారతీయ జనతా పార్టీకి ప్రయోజనం చేకూర్చేలా ఈసీఐ అనుమానాస్పద విధానాన్ని, దాని నిర్ణయాలను బహిర్గతం చేశారన్నారు. ఎన్నికల్లో బీజేపీ దాని కూటమి భాగస్వాములకు ప్రయోజనం చేకూర్చేలా దుష్ప్రవర్తనలను ప్రోత్సహిస్తున్నందున ఈసీఐ డిజిటల్ ఫార్మాట్‌లో ఎన్నికల డేటాను అందించడం లేదన్నారు. "2024 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని మహా వికాస్ అఘాడి 48 లోక్‌సభ స్థానాల్లో 31 స్థానాలను గెలుచుకుంది. కానీ నాలుగు నెలల తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అనుమానాస్పదంగా ఓడిపోయింది. "ఓటర్లు తక్కువ సమయంలో తమ అభిప్రాయాన్ని మార్చుకోరు మరియు ఇది ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అనేక సందేహాలను లేవనెత్తుతుంది," అని రుద్రరాజు పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగినప్పటికీ, రాబోయే బీహార్ ఎన్నికల్లో బిజెపి భారీ ఓటమిని చవిచూస్తుందన్నారు. ఎన్నికల వ్యవస్థపై రాహుల్ గాంధీ చేసిన అవిశ్రాంత పోరాటం సాధారణ ప్రజల దృష్టిని ఆకర్షించిందని తెలిపారు. గత 11ఏళ్ళల్లో వైయస్సార్‌సీపీ మరియు టీడీపీ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ యొక్క పేలవమైన పరిపాలనతో ప్రజలు విసిగిపోయారని పేర్కొంటూ కాంగ్రెస్ అతి త్వరలో ఆంధ్రప్రదేశ్‌లో బలమైన రాజకీయ శక్తిగా ఎదుగుతుందని రుద్రరాజు ధీమా వ్యక్తం చేశారు. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఆంధ్రప్రదేశ్‌పై ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రతి స్థాయిలో పార్టీని పునరుద్ధరించడానికి కొత్త రాజకీయ వ్యవహారాల కమిటీని నియమించిందని చెప్పారు. అంతర్గత ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ యొక్క ప్రాముఖ్యతను విస్మరించిన ప్రాంతీయ పార్టీల పనితీరు పట్ల కాంగ్రెస్ పార్టీని విడిచిపెట్టిన చాలామంది నాయకులు తిరిగి పార్టీలోకి వస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే వికృత దాడులు

### వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర

**విజయవాడ, ఆగస్టు 11(జర్నలిస్ట్‌ఫైల్):**




పల్నాడు జిల్లా దాచేపల్లి జూనియర్ కళాశాల విద్యార్థిపై డిగ్రీ కళాశాల విద్యార్థి బీసీ హాస్టల్లో వికృతంగా దాడి చేసి కరెంట్ షాక్‌తో హత్యాయత్నం చేసిన ఘటనలో ప్రభుత్వ వైఫల్యం తీవ్రంగా ఉందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఖండించారు. జూనియర్ కళాశాల విద్యార్థిని బీసీ హాస్టల్లోకి పిలిపించుకుని మరీ భౌతికంగా దాడి చేసి విద్యుత్ షాక్‌తో హత్యాయత్నం చేస్తుంటే హాస్టల్లో వార్డెన్ ఏమి చేస్తున్నాడని తెలిపారు. బీసీ సంక్షేమ శాఖా మంత్రి సవిత తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం విద్యాసంస్థలో యధేచ్ఛగా అమలవుతుందని దుయ్యబట్టారు. హాస్టల్లో మద్యం,గంజాయి సరఫరా అవుతుంటే సంక్షేమాధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. మంత్రి సవిత మాటలే తప్ప ఆచరణ శూన్యమని ఎద్దేవా చేశారు. కనీస పర్యవేక్షణ లేదన్నారు. పైగా విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాలకి ప్రవేశం లేదని ఉత్తర్వులిచ్చి కూటమి సర్కారు దారుణంగా వ్యవహరించిందన్నారు. వీటిల్లో తమ వైఫల్యాలు బహిర్గతం అవుతాయానే భయంతోనే అడ్డగోలు జీవోలు జారీ చేసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వ పదిహేను నెలల పాలనలో విద్యారంగం పూర్తిగా నీరుగారి పోయిందన్నారు. జగన్ ఐదేళ్ళ పాలనలో విద్యారంగంలో అనేక సంక్షేమ, సంస్కరణలు అమలు జరిగాయన్నారు. కూటమి సర్కారు పాలనలో విద్యాసంస్థలు, హాస్టళ్ళు మద్యం, గంజాయి కేంద్రాలుగా మారాయన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని గాలికొదిలేసి విద్యా శాఖా మంత్రి లోకేష్ షాడో సీయంలాగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. విద్యాసంస్థలు, హాస్టళ్లలో నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. సంక్షేమ శాఖా మంత్రులు, అధికారులు హాస్టళ్లలో నిద్రించాలని డిమాండ్ చేశారు. దాచేపల్లి బీసీ హాస్టల్లో జరిగిన అమానవీయమైన ఘటన ప్రభుత్వ నిరక్ష్యానికి నిదర్శనమన్నారు.

# ఐపీఎం ఉద్యోగుల సమస్యలకు పోరాటాలే శరణ్యం

- ఆంధ్ర ప్రదేశ్ ఐపిఎం ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు

**విజయవాడ, ఆగస్టు 11(జర్నలిస్ట్‌ఫైల్):**



వైద్య ఆరోగ్య శాఖలో ఎంతో ప్రాధాన్యత కలిగిన ఐపియం ఆంధ్ర ప్రదేశ్ శాఖ నిర్వీర్యం కావడానికి డిపార్ట్ మెంట్ అధికారులే కారణమని ఐపిఎంను నిలబెట్టుకోవాలన్నా ఆంధ్ర ప్రదేశ్ ఐపిఎం ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు అన్నారు. ఆదివారం విజయవాడ ప్రెస్ క్లబ్ లో ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినుకొండ రాజారావు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ఐపిఎం ఉద్యోగుల సంఘనికి పూర్వ వైభవం సాధించుకోవాలన్నా, ఉద్యోగస్తులు పదోన్నతులు పొందాలన్నా,ఆత్మగౌరవం నిలబెట్టుకో వాలన్నా, సమస్యలకు పరిష్కారం పోరాటాలే శరణ్యమని అన్నారు. డిపార్ట్ మెంట్ లో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి సంఘం రాజీలేని పోరాటం చేయనున్నట్లు, అలాగే డిపార్ట్ మెంట్ లో ఉద్యోగుల సమస్యలపై సరైన సమాచారం ప్రభుత్వానికి అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పదోన్నతులకు కొంతమంది అడ్డుగా నిలిచారని, డిపార్ట్ మెంట్ మనుగడ సాగించాలంటే ఇంచార్జ్ పాలనను కాకుండా డైరెక్టర్ పోస్ట్ మంజూరు చేసి, అర్హులైన వారిని నియమించాలని, స్టేట్ ఫుడ్ లేబొరేటరీ ని వెంటనే ప్రారంభించాలని కోరారు. తిరుపతి జిల్లా ప్రయోగ శాలలో అర్హులైన సీనియర్ అనలిస్ట్ లను కాదని ఒక సంవత్సరం డిప్యూటేషన్ పై వచ్చిన డాక్టర్లకు అప్పగించే విధానాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. జిల్లా ప్రయోగశాలను నిర్వీర్యం చేసే విధానం అక్రమమని, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్లు చాలామంది పదోన్నతులు లేకుండానే పదవి విరమణ చేయుచున్నారని ఆరోపించారు. అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని, గజిటెడ్ ఫుడ్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న వారికి అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్‌గా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లకు గజిటెడ్ ఫుడ్ ఇన్స్పెక్టర్ గా పదోన్నతులు కల్పించాలని, కండిషన్ పదోన్నతులు పొందిన జూనియర్ ఎనలిస్టులు గా విధులు నిర్వహిస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని అన్నారు. అర్హతలుండి పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న శాంపిల్ టేకర్స్ కు పదోన్నతులు కల్పించాలని, డిప్యూటేషన్ పై కొనసాగుతున్న ల్యాబ్ టెక్నీషియన్ లను డిపార్ట్ మెంట్ లో మెర్జ్ చేయాలని, హెడ్ ఆఫీసు లో అర్హులైన వారికి వెంటనే పదోన్నతులు కల్పించాలని అన్నారు. 20 సంవత్సరాలుగా శాంపిల్ టేకర్లుగా విధులు నిర్వహిస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అపరిష్కృతంగా ఐపియంలో ఉన్న సమస్యల పరిష్కారానికి మద్దతు ఇస్తామని యునైటెడ్ మెడికల్ హెల్త్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ తాళ్లూరి వెంకటేశ్వర్లు, నేషనల్ హెల్త్ మిషన్ జేఏసీ చైర్మన్ దయామణి, విజయవాడ మున్సిపల్ ఆల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చలం, మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు బి శ్రీనివాసరావు, ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు నాగేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కొండపల్లి శ్రీనివాసరావు, గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.యస్ నారాయణ, ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రెటరీ గాలంకి సతీష్, సంఘం జనరల్ సెక్రెటరీ ఆర్. శ్రీనివాసులు, సప్పా శ్రీనివాస్, యుగంధర్. శివకుమార్ సత్యనారాయణ, గంగాధర్, సుధీర్, సూర్య ప్రకాష్,వీరబ్రహం, చుక్కారావు, మోజస్,బ్లెస్సి పంతులు, వివిధరకాల సంఘాలు పాల్గొని సంపూర్ణ మద్దతు తెలియజేశారు.

# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహన డ్రైవర్ల కేంద్ర సంఘం అధ్యక్షులుగా రమేష్ బాబు






**గుంటూరు, ఆగస్టు 11(జర్నలిస్ట్‌ఫైల్):**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహన డ్రైవర్ల కేంద్ర సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం గుంటూరు పట్టణ ఏపీ ఎన్జీవో భవనమునందు రాష్ట్ర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశమునకు 13 ఉమ్మడి జిల్లాల నుండి ప్రభుత్వ డ్రైవర్లు సుమారు 150 మంది హాజరై ఇప్పటివరకు కేంద్ర సంఘ అధ్యక్షులుగా ఉంటున్న సంసాని శ్రీనివాసరావుపై అనేక ఆరోపణలు అవినీతి కార్యకలాపంలో పై చర్చించారు. రాష్ట్రంలో ఉన్న సభ్యుల సమస్యలు పరిష్కారం చేయనందున వారిపై అవిశ్వాసము ప్రకటించి శ్రీనివాసరావుని సంఘ అధ్యక్ష పదవి నుండి తొలగించి వారి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వ డ్రైవర్ల కేంద్ర సంఘ రమేష్ బాబుని నియమిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అనంతరం పి రమేష్ బాబు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డ్రైవర్ల కేంద్ర సంఘ అధ్యక్షులుగా పదవి బాధ్యతలు స్వీకరించారు. సంసాని శ్రీనివాసరావుకి ప్రభుత్వం వారు దయతో కల్పించిన ఓడి సదుపాయము రద్దు చేయవలసినదిగా ప్రభుత్వం వారిని కోరుతూ తీర్మానం చేశారు. నూతనముగా కేంద్ర సంఘ రాష్ట్ర అధ్యక్షులుగా నియమించబడిన పి రమేష్ బాబుని గుంటూరు జిల్లా ఏపీ అంజి న్యూస్ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, ఎస్ కె షరీఫ్, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్, సిటీ అధ్యక్షులు సూరి, ఆల్ ఇండియా గవర్నమెంట్ డ్రైవర్ కాన్ఫిడేషన్ జాతీయ అధ్యక్షుడు వై నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో బీసీ ల అభ్యున్నతికి కృషి చేసిన యోధుడు పుంజాల శివశంకర్

- యువనేతలకు మార్గం చూపిన అగ్రనేత
- రాష్ట్ర కాపు జే ఏ సీ అధ్యక్షులు చందు జనార్ధన్

**విజయవాడ, ఆగస్టు 11(జర్నలిస్ట్‌ఫైల్):**



దేశంలో బీసీ ల అభ్యున్నతికి కృషి చేసిన యోధుడు స్వర్గీయ పుంజాల శివశంకర్ అని రాష్ట్ర కాపు జే ఏ సి అధ్యక్షులు చందు జనార్ధన్ కొనియాడారు. పుంజాల శివశంకర్ 96 వ జయంతి వేడుకలు ఆదివారం విజయవాడలో గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో చందు జనార్ధన్, కొలనుకొండ శివాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. బీసీ నేత కొలను కొండ శివాజీ అధ్యక్షత వహించ గా కాపు జే ఏ సి అధ్యక్షులు చందు జనార్ధన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో వంగవీటి మోహనరంగా ఉద్యమ పోరాటంలో వారికి పూర్తి స్థాయి మద్దతు తెలిపి వెనుక నిలిచిన మహోన్నతుడు పుంజాల శివశంకర్ అని కొనియాడారు. స్వయం కృషి తో ఎదిగి న్యాయ వాదిగా న్యాయ మూర్తి గా కేంద్ర మంత్రిగా గవర్నర్ గా సేవలందించి కార్యకర్తలను అగ్రస్థాయి కి పెంచి నేటి వేదిక మీద ఉన్న నాయకులకు రహదారి చూపించిన యోధులు శివశంకర్ అని కొనియాడారు. పుంజాల శివశంకర్ చిత్ర పటానికి నాయకులంతా ఘనం గా నివాళులు అర్పించారు. అనంతరం మాజీ మంత్రి సీనియర్ శాసనసభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ తాను శాసన సభ్యుడు గా ఉండటానికి గల కారణం పుంజాల శివశంకర్ వల్ల నే అని అన్నారు.1989 లో నాకు వచ్చిన బీ ఫామ్ మారితే తిరిగి రాజీవ్ గాంధీ చే నేరుగా బీ ఫామ్ ఇప్పించిన నాయకులు శివశంకర్ అని స్మరించు కున్నారు.జాతీయ స్థాయి నాయకత్వం లో ఉన్న కార్యకర్తలను గుర్తించి ప్రోత్సహించిన ఘనత వారిది అని కొనియాడారు. సెంట్రల్ శాసన సభ్యులు బొండా ఉమ మాట్లాడుతూ తాను మొదటిసారిగా పుంజాల శివశంకర్ పేరు వంగవీటి మోహన రంగా వద్ద విన్నామని వారివెంట శివశంకర్ కార్యాలయానికి ఇంటికి తరచుగా వెళ్లే వాడినని గుర్తు తేచారు. వంగవీటి మోహనరంగా కు వెన్ను దన్నుగా నిలిచి మద్దతు తెలిపిన నాయకులు పుంజాల అని గుర్తు చేశారు.సీనియర్ శాసన సభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ సామాన్య జీవితం తో ప్రారంభమై కష్టాలు చవి చూసిన ప్రదేశం లోనే కేంద్ర మంత్రి గా పుంజాల శివశంకర్ ఎదిగారని అన్నారు.అప్పటి ప్రధాని ఇందిరా గాంధీకి కష్టాల్లో వెన్నంటి ఉండటమే కాకుండా న్యాయ పరమైన సలహాలు ఇవ్వడానికి పిలిపించు కున్నారని అన్నారు. ప్రధాన మంత్రి స్థానం మిస్ అయినా నాయకులు శివశంకర్ అని అన్నారు. జాతీయ స్థాయిలో రాజకీయా ల్లో చురుకైన పాత్ర పోషించారని కాంగ్రెస్ రాజకీయాల్లో వారి స్థానం చెరగని ముద్ర అని కొనియాడారు.బీసీ సంఘ నాయకులు జి గురునాథం, కాపునాడు అధ్యక్షు లు గళ్ళ సుబ్రహ్మణ్యం,రాధా రంగా మిత్రమండలి అధ్యక్షులు చెన్నుపాటి శ్రీనివాస్ వేదిక పంచు కున్నారు. ఆకుల తిరుమలరావు వందన సమర్పణ చేయగా ఈ కార్యక్రమంలో ప్రముఖులు మా ఆర్ట్స్ బాబీ,చంటి, సుంకర సాంబశివరావు,వెలగ సురేష్, కొండేటి రాజేంద్ర, నరహరి శెట్టి నరసింహారావు, పోరు మామిళ్ల ఈశ్వర్, అడబాల సత్యనారాయాన, చలమల శెట్టి కోటేశ్వర రావు,బడిత శంకర్, చందు భావనా రాయణ,తోట సాంబశి వరావు, పెన్నేటి దామో దర్, కట కం ధర్మారావు, రామాయణపు సాంబయ్య లు పాల్గొన్నారు.

## బైక్‌పై నగర ట్రాఫిక్ తనిఖీ చేసిన ఎస్పీ



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సోమవారం ఉదయం ద్విచక్రవాహనంపై నగర వీధుల్లోకి వచ్చి ట్రాఫిక్ పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. కంకరగుంట అండర్‌పాస్, బ్రాడీపేట 4వ లైన్, శంకర్ విలాస్ సెంటర్, డొంక రోడ్డు, మూడు వంతెనలు, రంగాబొమ్మ సెంటర్, కొత్తపేట శివాలయం సెంటర్, డీమార్ట్ సెంటర్, నాజ్ సెంటర్, విమెన్స్ కాలేజీ రోడ్, ఎంటీబీ సెంటర్‌లను సందర్శించి ట్రాఫిక్ నియంత్రణ పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ ట్రాఫిక్ పోలీసులు ఎక్కడా జామ్‌లు ఏర్పడకుండా సమయానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వాహనదారులు మళ్లింపులను తప్పనిసరిగా పాటించాలన్నారు. ట్రాఫిక్ నెమ్మదించినా సహనం పాటించాలనీ, వ్యాపార సముదాయాలు తమ కస్టమర్ల కోసం ప్రత్యేక పార్కింగ్ సదుపాయం కల్పించాలనీ సూచించారు. వాహనాలు రోడ్డుపై కాకుండా నిర్ణీత పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపేలా చూడాలని ఆయన స్పష్టం చేశారు. పర్యటనలో ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్, వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య, ట్రాఫిక్ ఎస్సైలు పాల్గొన్నారు.

## అర్జీలకు గడువులో పరిష్కారం



గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):డయల్ యువర్ కమిషనర్, పిజిఆర్ఎస్ కార్యక్రమాల్లో ప్రజలు అందించే అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పిజిఆర్ఎస్ నిర్వహించారు. డయల్ యువర్ కమిషనర్‌లో 28 ఫిర్యాదులు స్వీకరించిన కమిషనర్, వాటిలో తక్షణ పరిష్కారం సాధ్యమైనవి, కొంత సమయం పట్టేవి వేరుగా జాబితా చేయాలని సూచించారు. పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని, పురోగతిని నివేదికల రూపంలో తన చాంబర్‌కు పంపాలని ఆదేశించారు. తరువాత పిజిఆర్ఎస్‌లో 32 అర్జీలు స్వీకరించగా, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 11, ఇంజినీరింగ్ 13, రెవెన్యూ 3, ప్రజారోగ్యం 2, ఉపసెల్ 2, అకౌంట్స్‌కు సంబంధించిన 1 ఫిర్యాదు ఉందని తెలిపారు. అర్జీలు ఎస్.ఎల్.ఏ దాటితే సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని అదనపు కమిషనర్‌ను ఆదేశించారు. ప్రతి విభాగంలో పిజిఆర్ఎస్, గ్రీవెన్స్ అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించాలని, జిఎంసి పిఎంయు బృందం ప్రత్యేకంగా పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు. క్షేత్రస్థాయి అధికారులు నేరుగా వెళ్లి సమస్య పరిష్కరించాక ఫిర్యాదుదారునికి సమాచారం ఇవ్వాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఇంచార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఎంఓహెచ్ (ఇంచార్జి) రామారావు, మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.

## అపరకర్మశాల అవసరం కరోనా సమయంలో గుర్తించా... డాక్టర్ వజ్రాల శివకుమార్



తెనాలి ,(జర్నలిస్ట్ ఫైల్) విశ్వబ్రాహ్మణ సంఘీయుల అవసరాల నిమిత్తం నూతనంగా నిర్మించిన అపర కర్మశాల భవనాన్ని ప్రముఖ వైద్యులు వజ్రాల శివకుమార్ ప్రారంభించారు. స్థానిక రామలింగేశ్వరపేట గురవయ్య కాలనీ సమీపన విశ్వబ్రాహ్మణ సంఘం నూతనంగా నిర్మించిన అపరకర్ణశాలను సోమవారం విజయవాడకు చెందిన న్యూరాలజిస్ట్ వజ్రాల శివకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరకర్ణశాల ఏర్పాటు ఆలోచన, కరోనా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వచ్చినట్లు తెలిపారు. సామాన్య మధ్యతరగతి కుటుంబాల వారు అద్దె ఇళ్లలో నివసిస్తున్న క్రమంలో, ఆ ఇంటి యజమానులు శుభకార్యాలకు అంగీకరిస్తారు కానీ, అశుభ సందర్భాలలో రోడ్డు మీదకు వచ్చే పరిస్థితి ఏర్పడుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని విశ్వబ్రాహ్మణ సంఘం అపరకర్ణశాల ఏర్పాటుకు తన వంతుగా తోడ్పాటు అందించినట్లు తెలిపారు. సంఘ అధ్యక్షులు జీవీ నాగార్జున మాట్లాడుతూ అపర కర్మశాల ఏర్పాటులు సహకరించిన సంఘీయులకు ధన్యవాదాలు తెలిపారు. విశ్వబ్రాహ్మణ సంఘం అవసరం గుర్తించి, తమ సంఘాన్ని ప్రోత్సహిస్తూ తొలుత సహకారం అందించింది, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అని, వారికి సంఘం తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గ సభ్యులు సంఘీయులు పాల్గొన్నారు.

## అయ్యపు సురేష్ గృహ ప్రవేశానికి రాజకీయ ప్రముఖులు



బ్రహ్మంగారిమఠం(కడప జిల్లా) (జర్నలిస్ట్ ఫైల్) మండల కేంద్రంలోని నూతనంగా నిర్మించిన అయ్యపు సురేష్‌బాబు దర్మపత్ని అమగంపల్లి సర్పంచ్ సౌమ్య దీప్తి గృహ ప్రవేశం ఆదివారం నిర్వహించారు. ఈ గృహప్రవేశానికి వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి కుమారుడు రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యరెడ్డి అమగంపల్లి ప్రభాకర్ రెడ్డి పోరుమామిళ్ల హనుమంత్ రెడ్డి వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం అధ్యక్షులు బన్నూరు కృష్ణమూర్తి ఎస్సార్ శ్రీనివాసులరెడ్డి ఆవుల దస్తగిరి నాయుడు సారే రామానాయుడు శీలం నరసింహ గౌడ్ దుగ్గిశెట్టి వెంకటేశ్వర్లు బి.మఠం మండల టిడిపి నాయకులు చెన్నుపల్లె సుబ్బారెడ్డి సొసైటీ అధ్యక్షులు సాంబశివారెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

# కోబాల్డ్‌పేట అభివృద్ధికి కృషి- ఎమ్మెల్యే గళ్ళా మాధవి

○ రూ. 54.8 లక్షల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 34వ డివిజన్ లోని కోబాల్డ్‌పేట్ ప్రాంతం ఎప్పటి నుంచో అభివృద్ధి పనులకు నోచుకోక వెనుకబడిన ప్రాంతంగా ఉన్నప్పటికీ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి డివిజన్‌కి సమాన ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తున్నామని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. సోమవారం కోబాల్డ్‌పేట లో రెండు ప్రధాన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ 34 డివిజన్ లోని 3వ లైన్ నుండి 1వ లైన్ వరకు, కోబాల్డ్‌పేట్ మెయిన్ రోడ్ వెస్ట్ సైడ్ వరకు సిసి డ్రెయిన్ మరియు కల్వర్టుల నిర్మాణానికి రూ. 26.60 లక్షలు, అదే విధంగా హవామంజిల్ నుండి పరిమళ మెడికల్ షాప్ వరకు సిసి డ్రెయిన్ మరియు కల్వర్టుల నిర్మాణానికి రూ. 28.20 లక్షలు మొత్తం : రూ. 54.8 లక్షల పనులకు శంకుస్థాపన చేసాము. గుంటూరు పశ్చిమ నియోజకవర్గములో "ప్రజా సమస్యలను పరిష్కరించడమే మా విధానం. కోబాల్డ్‌పేట్‌లో ప్రధానంగా ఉన్న కుక్కల సమస్య, బ్లాక్ అయిన డ్రెయిన్ల సమస్యలు, ఎలిమెంటరీ స్కూల్స్ దగ్గర పిల్లల భద్రత కోసం స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు వంటి అంశాలను మేయర్ గారి దృష్టికి తీసుకెళ్లాము. వీటన్నింటికీ త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు," కూటమి ప్రభుత్వం ప్రతి మారుమూల ప్రాంతాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తోంది. కోబాల్డ్‌పేట్ ఇక వెనకబడిన డివిజన్ కాదుఅభివృద్ధి, ఆధునిక సౌకర్యాల దిశగా దూసుకుపోతుంది," అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర, తాళ్ళ వెంకటేశ్ యాదవ్, షేక్ అన్వర్, మానుకోండ శివ ప్రసాద్, బూసి రాజలత, సుభాని, మువ్వా వేణు, గుజ్జుం ప్రసాద్ మరియు ఎన్డీయే కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కిడ్నీ మార్పిడి వైద్యం కోసం సాయం చేయండి

○ చాట్లరవికుమార్ విన్నపాలు



తెనాలి ,(జర్నలిస్ట్ ఫైల్) రెండు కిడ్నీలు పాడైపోయిన ఆ యువకుడు కిడ్నీ వైద్యానికి ఆర్థిక సాయం కోరుతూ సబ్ కలెక్టర్ కార్యాలయంలో, ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సోమవారం వినతి పత్రం సమర్పించిన వైనం మిది.

కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామం అరుంధతి నగర్ కు చెందిన, చాట్ల నాగయ్య అరుంధతి దంపతుల కుమారుడు చాట్ల రవిబాబు, ట్రిబుల్ ఎక్స్ కంపెనీలో పని చేస్తూ విధి నిర్వహణలో, లిఫ్ట్ వైరు తెగిపోయి కింద పడిన ప్రమాదంలో కాలు దెబ్బ తినడంతో, అందుకు అయ్యే వైద్య సేవలు నిమిత్తం తనకు ఉన్న ఇంటి స్థలం విక్రయించి వైద్య సేవలు చేయించారు తల్లిదండ్రులు. ఆ సమయంలో పెయిన్ కిల్లర్స్ ఎక్కువగా తీసుకోవడం వల్ల ప్రస్తుతం రెండు కిడ్నీలు దెబ్బతిని, వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక భరోసా లేకపోవడంతో, సబ్ కలెక్టర్ కార్యాలయంలో, ఆర్థికసాయం కోరుతు వినతిపత్రం సమర్పించాడు. తన తండ్రి ఒక కిడ్నీ ఇవ్వడానికి సిద్ధమైన క్రమంలో, ఎన్ఆర్ఐ హాస్పిటల్లో కిడ్నీ ప్లాంటేషన్ కోసం 6 లక్షలు ఖర్చు అవుతాయని చెప్పారని, అంతటి ఆర్థిక స్తోమత తనకు లేకపోవడంతో దాతల సహాయం కోరుతున్నానని అంటున్న, రవిబాబుకు మానవతా దృక్పథంతో అతని కిడ్నీ ఆపరేషన్ కు, ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం చేయాలని, లేదా దాతలు సహాయం చేయాలని కోరుతున్నాడు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడం, ఇంట్లో ఆర్థిక పరిస్థితి సహకరించక పోవడం వంటి సమస్యతో ఇబ్బంది పడుతున్న చాట్ల రవిబాబుకు తోడ్పాటు అందించాలన్న ఆసక్తి ఉన్నవారు, 6302 79 1410 సెల్ నెంబర్ కు కాల్ చేసి సహకరించాలని కోరుతున్నాడు.

# శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాలకు

## సిద్ధమైన ఐదు టన్నుల నిమ్మకాయ పచ్చడి, లక్ష వాటర్ బాటిల్స్



తెనాలి ,(జర్నలిస్ట్ ఫైల్) భగవాన్ శ్రీ సత్య సాయి బాబా జయంతి వేడుకలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలుఅధికారికంగా నిర్వహించేందుకు జీవో విడుదల చేసిన క్రమంలో ఉత్సవాలను నవంబర్ 23న,ఘనంగా నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సంఘాల తెనాలి డివిజన్ కోఆర్డినేటర్ సదాశివ్ పేర్కొన్నారు.

సోమవారం కుమార్ పంప్స్ సంస్థల ప్రాంగణంలో ఉత్సవాలకు సిద్ధం చేస్తున్న ఐదు టన్నుల నిమ్మకాయ పచ్చడి, లక్ష వాటర్ బాటిల్స్ కుమార్ పంప్స్ తరఫున అందజేస్తున్న నేపథ్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో కార్యక్రమం ఉద్దేశాన్ని సదాశివ్ మీడియాకు వివరించారు. సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల నిర్వహణపై, జూలైలో జరిగిన సమావేశాల్లో గుంటూరు జిల్లా తెనాలి నుండి కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం తమ వంతుగా, ఉత్సవాలకు హాజరయ్యే భక్తుల భోజన సౌకర్యం లో, వినియోగించుటకు, ఐదు టన్నుల నిమ్మకాయ పచ్చడి తయారీ పూర్తయిందని, లక్ష వాటర్ బాటిల్స్ కూడా సిద్ధమవుతున్నాయని తెలిపారు. శత జయంతి ఉత్సవాల కార్యాచరణను వివరించారు.

## మఠం హుండీ ఆదాయం 28 లక్షలు



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్) ప్రముఖ పుణ్యక్షేత్రం జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం నందు తేదీ. 11-08-2025 న హుండీలు లెక్కించగా వచ్చిన నగదు రూ : 2822899/-, బంగారు-0.035.500 మిల్లి గ్రాములు, వెండి -990 గ్రాములు మఠంనకు ఆదాయం గా వచ్చింది. ఈ హుండీ ల లెక్కింపు కార్యక్రమం లో ఫిట్ పర్సన్ శంకర్ బాలాజి మఠం మేనేజర్ ఈశ్వరచారి దేవాదాయ శాఖ ఆఫీసర్ భారతి బ్యాంక్ సిబ్బంది పోలీస్ వారు భక్తులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. ఈ హుండీ లెక్కింపు నందు పూర్వ పిఠాధిపతి సతీమణి మారుతి మహాలక్ష్మి పాల్గొనడం జరిగింది .

## ప్రత్యేక అలంకరణలో శ్రీ బుగ్గరామలింగేశ్వర స్వామి



తాడిపత్రి, (జర్నలిస్ట్ ఫైల్) : పెన్నా నది పరివాహక ప్రాంతంలో శ్రీరామచంద్రునిచే ప్రతిష్టింపబడిన శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి సోమవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసం మూడవ సోమవారం సందర్భంగా శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి మూలవిరాట్ ను వివిధరకాల పుష్పాలతో సుందరంగా అలంకరణ గావించి, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

# బ్రహ్మంగారిమఠం అభివృద్ధి కొరకు అధికారులతో పుట్ట సమీక్ష

○ బ్రహ్మంగారిమఠం అభివృద్ధి కొరకు కేంద్ర ప్రభుత్వం యొక్క ప్రసాదం స్కీం కింద దాదాపు 50 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన మైదుకూరు శాసనసభ్యులు పుట్ట సుధాకర్ యాదవ్



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్) మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ నేతృత్వములో బ్రహ్మంగారి మఠం నందలి ప్రముఖ పుణ్యక్షేత్రాలు అయినటువంటి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం ఈశ్వరి దేవి మఠము కక్కయ్య స్వామి మఠము పోలేరమ్మ గుడి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి గారు నివసించిన నివాసము అదే విధంగా మఠము నందలి రోడ్ల విస్తరణకు కేంద్ర ప్రభుత్వమునకు సంబంధించిన ప్రసాదం స్కీము క్రింద ప్రతిపాదనలు పంపించుటకు దేవాదాయ ధర్మాదాయ శాఖ వారు మరియు టూరిజం శాఖ అధికారులతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు సమీక్షసమావేశం నిర్వహించడం జరిగినది. దీని యొక్కప్రధాన ఉద్దేశం ఏమిటంటే బ్రహ్మంగారి మఠం నందు ఉన్న రోడ్లు దేవాలయాలు అభివృద్ధి పరచుటకు అవసరమైన డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ తయారు చేయడం. ఈ సమీక్షసమావేశంలో భక్తుల సౌకర్యార్థం వసతి గృహాల నిర్మాణం కళ్యాణకట్ట గ్రానైట్ ఫ్లోరింగ్ లడ్డు మరియు ప్రసాదం కౌంటర్ల ఏర్పాటు భక్తుల క్యూ లైన్ ఏర్పాటు మాడ వీధుల అభివృద్ధి భక్తుల సౌకర్యార్థం బస్టాండ్ నిర్మాణం అలాగే నాలుగు రోడ్ల కూడలి అభివృద్ధి మఠం సెంటర్ నందు విద్యుత్ దీపాల ఏర్పాటు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి నివాస గృహ పునరుద్ధరణ అలాగే స్వామివారి చరిత్రను తెలియజేస్తూ మ్యూజియం ఏర్పాటు అలాగే పోలేరమ్మ గుడికి రోడ్డు నిర్మాణ తదితర అభివృద్ధి కార్యక్రమాలకు దాదాపు 50 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు పంపుటకు సమీక్ష నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో టూరిజం శాఖ డిప్యూటీ ఇంజనీరు శ్రీనివాస్ బ్రహ్మంగారి మఠం ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ ఈశ్వరి దేవి మఠం ఈవో జగన్మోహన్ రెడ్డి మండల అధ్యక్షుడు సుబ్బారెడ్డి సొసైటీ చైర్మన్ సాంబశివారెడ్డి ఎస్ ఆర్ శ్రీనివాసులు పూజా శివ యాదవ్ మరియు తదితరులు పాల్గొనడం జరిగినది.

## 14న 10 కి.మీ. జాతీయ జెండా ప్రదర్శన



గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):కుల, మతాలకు అతీతంగా దేశభక్తి స్ఫూర్తిని చాటేలా ఈ నెల 14న (గురువారం) గుంటూరులో 9 అడుగుల వెడల్పుతో 10 కి.మీ. పొడవైన జాతీయ జెండా ప్రదర్శన జరగనుంది. ఈ ప్రతిష్టాత్మక రికార్డ్ ప్రదర్శనలో నగర ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో కమిషనర్ పులి శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ షేక్ సజిలా, మేయర్ రవీంద్ర విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. దేశంలో తొలిసారిగా 10 కి.మీ. జాతీయ జెండా ప్రదర్శన జరగబోతోందని, ఇటువంటి దేశభక్తి యుత కార్యక్రమాలు ప్రజల ఐక్యతను బలోపేతం చేస్తాయని మేయర్ తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి ఆదేశాల మేరకు, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఆజాదీ కా అమృతోత్సవ్‌లో భాగంగా ఈ నెల 9 నుండి 16 వరకు విద్యార్థుల కోసం రంగోలి, వ్యాసరచన, వక్తృత్వం, పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రమంలో 14న మధ్యాహ్నం 3 గంటలకు 10 కి.మీ. జాతీయ జెండా ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న 9 కి.మీ. జెండా ప్రదర్శన రికార్డును అధిగమించేందుకు ఇది అవకాశం అవుతుందని చెప్పారు. జెండా ప్రదర్శనకు మూడు మార్గాలను గుర్తించి, ట్రాఫిక్ విభాగానికి అందించామని, వారు ఫైనల్ చేసిన మార్గంలో ప్రదర్శన ఉంటుందని తెలిపారు. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంస్థలు, నగర ప్రజలు అందరూ జెండా ప్రదర్శనలో పాల్గొనాలని కమిషనర్ పిలుపునిచ్చారు. అలాగే హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13 నుండి 15 వరకు ప్రతి ఇంటి మీద జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ జాతీయతా భావం పెంపొందించేందుకు, విద్యార్థులు, యువతకు స్వాతంత్ర్య పోరాట గాథను పరిచయం చేసేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, బి. స్మితపద్మజ, డి. లక్ష్మీదుర్గ పాల్గొన్నారు.

## గుంటూరులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక



గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ హాజరై, జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యలను స్వయంగా విన్నారు. ప్రజల నుండి అందిన వినతులను పరిశీలించిన ఎస్పీ, సంబంధిత పోలీస్ అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి, నిర్ణీత గడువులోపు చట్టబద్ధంగా పరిష్కరించాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం కల్పించడంలో నిర్లక్ష్యం చూపరాదని అధికారులకు స్పష్టం చేశారు. ఎస్పీ ముఖ్యంగా ప్రజలకు ఎటువంటి భయం లేకుండా తమ సమస్యలను చెప్పగలరని భరోసా ఇచ్చారు. అందిన అన్ని రాతపూర్వక ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపించి, చట్టపరమైన దర్యాప్తు జరిపి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పీజిఆర్ఎస్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కుటుంబ విభేదాలు, ఆర్థిక సమస్యలు, భూవివాదాలు, ఇతర సామాజిక సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించి పరిష్కార చర్యలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఏఆర్) ఏ. హనుమంతు, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీసీఎస్ డీఎస్పీ శివాజీ రాజు, పీజిఆర్ఎస్ సీఐ బిలాలుద్దిన్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మధురై నగరంలో... జనవరిలో కమ్మ మహానాడు



○ మొదలైన ఏర్పాట్లు

○ కెజిఎఫ్ వ్యవస్థాపకులు జెట్టి కుసుమ కుమార్

తెనాలి ,(జర్నలిస్ట్ ఫైల్) కమ్మ సామాజిక వర్గంలో జన్మించి సమాజ సౌభాగ్యం కోసం వ్యయ ప్రయాసలకు ఓర్చిన, ఉదార స్వభావులైన గొప్ప వ్యక్తులు ఉన్నారని వారి స్ఫూర్తితోనే కేజీఎఫ్ సంస్థ పనిచేస్తుందని సంస్థ వ్యవస్థాపకులు జెట్టి కుసుమకుమార్ పేర్కొన్నారు. కే జి ఎఫ్ సంస్థ వ్యవస్థాపకులు జెట్టి కుసుమ కుమార్ సోమవారం తెనాలి వచ్చిన సందర్భంగా, సంస్థ జెండాను ఆవిష్కరించారు. తెనాలి పట్టణ కేజీఎఫ్ అధ్యక్షులు జెట్టి శివరామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కుసుమకుమార్ మాట్లాడుతూ 2026వ సంవత్సరం, జనవరి నెలలో,తమిళనాడు రాష్ట్రంలోని మదురై నగరంలో,పది లక్షల మందితో, కమ్మ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మహానాడు ఉద్దేశం కమ్మ సామాజిక వర్గం ద్వారా సమాజంలో జరిగిన మంచిని ప్రజల్లోకి తీసుకువెళ్లడమే అన్నారు. తెనాలి శాఖ అధ్యక్షులు జెట్టి శివరామకృష్ణ మాట్లాడుతూ 2026 లో జరిగే కమ్మ మహానాడు జయప్రదం చేసే విషయంలో తమ వంతుగా కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో జెట్టి రావణబ్రహ్మ, నాగేశ్వరరావు, నన్నపనేని రఘువీర్, ప్రవీణ్, సాయి, అన్నె చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## శ్రీశైలం పంచమఠాల్లో విశేష పూజలు



శ్రీశైలం (జర్నలిస్ట్ ఫైల్): లోకకల్యాణం కోసం శ్రీశైల పంచమఠాల్లో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఘంటామఠంలో ప్రారంభమైన పూజలు వరుసగా భీమశంకర, విభూతి, రుద్రాక్ష, సారంగధర మఠాల్లో కొనసాగాయి. దేశ శాంతి, సమృద్ధి పంటలు, ప్రజల ఆయురారోగ్యాల కోసం అర్చకులు సంకల్పం పఠించారు. గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంప్రదాయబద్ధంగా అభిషేకాలు, పుష్పార్చనలు జరిగాయి. 7వ శతాబ్దం నాటి ఈ మఠాలు ఆలయాల్లా నిర్మించబడి, ఆలయ నిర్వహణలో ప్రధానపాత్ర పోషించాయి. ఇటీవల దేవస్థానం ఘంటా, విభూతి, రుద్రాక్ష మఠాలను పునరుద్ధరించగా, భీమశంకర మఠానికి మరమ్మతులు చేసింది. నిత్యధూపదీప, నివేదన కైంకర్యాలు కొనసాగుతున్నాయి.

## ఏలూరులో 'లెటర్ టు ఇండియా' కార్యక్రమం

**ఏలూరు (జర్నలిస్ట్ ఫైల్):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రుల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు శ్రీ లక్ష్మీ విద్యా నికేతన్ డైరెక్టర్ మార్గాని నాగ శ్రీకాంత్ తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో ఆగస్టు 15న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు 'లెటర్ టు ఇండియా' పేరుతో ఈ కార్యక్రమం జరుగనుంది. తల్లిదండ్రులు భారతదేశానికి ఒక ఉత్తరం రాసి, పిల్లల భవిష్యత్తు సంపన్నంగా, సురక్షితంగా, సంతోషంగా ఉండేలా దేశం ఎలా ఉండాలన్న అంశంపై తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాల్సి ఉంటుంది. సేకరించిన లేఖలను పాఠశాల అధికారిక ఇన్‌స్టాగ్రామ్ పేజీలో అప్‌లోడ్ చేస్తారు. ఎక్కువ లైకులు సాధించిన లేఖలకు మొదటి బహుమతి రూ. 1,000, రెండవ బహుమతి రూ. 500, మూడవ బహుమతి రూ. 500 నగదు బహుమతులు అందజేస్తారు.

### పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికలకు సర్వం సిద్ధం



**పులివెందుల (జర్నలిస్ట్ ఫైల్):** పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాల్లో రేపు ఉపఎన్నికలు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఎంపీడీఓ కార్యాలయ్యాల్లో పోలింగ్ సామాగ్రిని పం పిణీ

ఈ రెండు జడ్పీటీసీ స్థానాల్లో 11 మంది చొప్పున అభ్యర్థులు పోటీ

పోలింగ్ బూత్‌లు మార్చాలన్న వైసీపీ పిటిషన్ తిరస్కరణ

ఏపీలోని పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాల్లో ఉపఎన్నికలకు మంగళవారం పోలింగ్ జరగనుంది. రెండు మండలాల్లో పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనుంది. ఎంపీడీఓ కార్యాలయ్యాల్లో పోలింగ్ సామాగ్రిని పంపిణీ చేశారు. సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.

పులివెందులలో పోలింగ్ బూత్‌లన్నింటినీ సున్నితమైనవిగా ప్రకటించారు. అన్ని చోట్ల వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయస్తున్నారు. ఒంటి మిట్టలో వెబ్‌కాస్టింగ్ లేని కేంద్రాల్లో మైక్రో-అబ్జర్వర్స్ ను నియమించారు. ఏపీఎస్పీ బెటాలియన్స్, డ్రోన్స్, క్లస్టర్ ఆధారిత పోలీస్ పర్యవేక్షణ, మొబైల్ సర్వైలెన్స్ వాహనాలతో సహా అన్ని స్థాయిల్లో భద్రతా పటిష్ఠంగా చేశారు.

ఇక, పులివెందుల జడ్పీటీసీలో 15 పోలింగ్ కేంద్రాల్లో సుమారు 10,601 ఓటర్లు, అలాగే ఒంటిమిట్ట మండలంలో 30 పోలింగ్ కేంద్రాల్లో 24,606 ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ రెండు జడ్పీటీసీ స్థానాల్లో 11 మంది చొప్పున అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. కాగా, పులివెందుల నుంచి వివేకా హత్య కేసులో నిందితుడిగా ఉన్న సునీల్ యాదవ్ బరిలో ఉన్నారు.

**పోలింగ్ బూత్‌లు మార్చాలన్న వైసీపీ పిటిషన్ తిరస్కరణ**

అంతకు ముందు పోలింగ్ బూత్‌లను వేరే చోట ఏర్పాటు చేశారంటూ హైకోర్టులో వైసీపీ వేసిన పిటిషన్ పై విచారమ జరిగింది. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. పోలింగ్ బూత్‌ల మార్పులో జోక్యాన్ని ఏపీ హైకోర్టు నిరాకరించింది.

## ప్రభుత్వ వాహనం వివాదంపై నిధి అగర్వాల్ క్లారిటీ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** సోషల్ మీడియాలో తనపై వస్తున్న ఓ వివాదంపై ప్రముఖ నటి నిధి అగర్వాల్ స్పందించారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరంలో ఓ స్టోర్ ప్రారంభోత్సవానికి వెళ్లినప్పుడు ఆమె ప్రభుత్వ వాహనాన్ని ఉపయోగించడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో అసలు విషయం వివరిస్తూ ఆమె సోషల్ మీడియా వేదికగా ఓ అధికారిక ప్రకటన విడుదల చేశారు.

భీమవరంలో జరిగిన కార్యక్రమానికి నిధి అగర్వాల్ ఏపీ ప్రభుత్వానికి చెందిన వాహనంలో రావడంపై పలు విమర్శలు వెల్లువెత్తాయి. ప్రభుత్వ అధికారులే ఆమె కోసం ప్రత్యేకంగా ఆ వాహనాన్ని పంపారని కొన్ని మీడియా కథనాలు, సోషల్ మీడియా పోస్టులు ప్రచారం చేశాయి. ఈ వార్తలు వైరల్ కావడంతో నిధి అగర్వాల్ స్వయంగా స్పందించి వివరణ ఇచ్చారు.

"భీమవరం పర్యటన సందర్భంగా స్థానిక కార్యక్రమ నిర్వాహకులే నాకు రవాణా సౌకర్యం కల్పించారు. వారు ఏర్పాటు చేసిన కారు ప్రభుత్వానికి చెందింది. ఆ వాహనాన్ని ఎంపిక చేసుకోవడంలో గానీ, కావాలని అడగడంలో గానీ నా పాత్ర ఏమాత్రం లేదు. కేవలం లాజిస్టికల్ అవసరాల కోసమే నిర్వాహకులు దానిని సమకూర్చారు" అని ఆమె తన ప్రకటనలో స్పష్టంగా పేర్కొన్నారు. అధికారులు తనకు వాహనాన్ని పంపారంటూ వస్తున్న వార్తలను కూడా ఆమె ఖండించారు. "ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి. ఈ విషయంలో ప్రభుత్వ అధికారులతో నాకు ఎలాంటి సంబంధమూ లేదు" అని ఆమె తేల్చి చెప్పారు. అభిమానులకు, శ్రేయోభిలాషులకు ఎలాంటి తప్పుడు సమాచారం చేరకూడదనే ఉద్దేశంతోనే ఈ వివరణ ఇస్తున్నట్లు నిధి తెలిపారు. తనపై ప్రేమ చూపిస్తున్న అభిమానులకు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. కాగా, నిధి అగర్వాల్ ఇటీవల పవన్ కల్యాణ్ హీరోగా నటించిన 'హరి హర వీర మల్లు' చిత్రంలో పంచమి పాత్రలో కనిపించారు.

## అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణం చేపట్టిన వారిపై ప్రత్యేక దృష్టి సారించడండి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- ప్రభుత్వ భవనాల్లో దుకాణాలు నడుపుతున్న యజమానులు సకాలంలో అద్దె చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని
- పారిశుద్ధ్య నిర్వాహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేదిలేదు
- అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తాం



**టెక్కలి, (జర్నలిస్ట్ ఫైల్):** టెక్కలి కేంద్రంలో అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణం చేపట్టిన యజమానులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం టెక్కలి పంచాయితీ కార్యాలయంలో పంచాయితీ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టెక్కలి కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ప్రధానంగా పారిశద్ధ్యంనిర్వాహణలో ఎక్కడ రాజీ పడకుండా ఉండాలని అధికారులు ఈ విషయంలో అలసత్వం వహించరాదని హెచ్చరించారు. విద్యుత్తు సౌకర్యంలో అంతరాయం లేకుండా చూడాలని, అన్ని వీధుల్లో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ భవనాల్లో దుకాణాలు నడుపుతున్న యజమానులు సకాలంలో అద్దె చెల్లించే విధంగా చూడాలని సూచించారు. మొత్తం 58 దుకాణాలు ఉన్నాయని అధికారులు వివరించారు. సకాలంలో చెల్లించన వారిపై దృష్టిసారించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వానికి ఆదాయ మార్గం వచ్చే విధంగా అధికారులు చొరవతో తీసుకోవాలని అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని అన్నారు. టెక్కలి ఆర్డీవో కార్యాలయంలో అర్హత ఉన్నవారు ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నాను. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు

## సిఎస్‌లతో కేబినెట్ కార్యదర్శి టివి సోమనాధన్ వీడియో సమావేశం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** త్వరలో జరగనున్న 5వ జాతీయ చీఫ్ సెక్రటరీల సమావేశం ఏర్పాట్లు మరియు వివిధ చట్టాల డీ రెగ్యులేషన్ తదితర అంశాలపై సోమవారం ఢిల్లీ నుండి కేబినెట్ కార్యదర్శి టివి. సోమనాధన్ వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, కేంద్ర పాలిత ప్రాంతాల అడ్మినిస్ట్రేటర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కేబినెట్ కార్యదర్శి సోమనాధన్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న 5వ జాతీయ చీఫ్ సెక్రటరీల సమావేశానికి సంబంధించి ఏర్పాట్లలో భాగంగా గత సమావేశానికి చెందిన ఫీడ్ బ్యాక్ నివేదికలను కంపైల్ చేసి అప్లోడ్ చేయాలని సూచించారు. అలాగే రానున్న సమావేశానికి ప్రతి రాష్ట్రం నుండి స్టేట్ స్పెసిఫిక్ అంశాలకు సంబంధించి 5 స్టేట్ స్పెసిఫిక్ నివేదికలను సమర్పించాలని అన్నారు. వివిధ నివేదికలను కంపైల్ చేసి అప్లోడ్ చేసేందుకు వీలుగా ఇంకా కొన్ని రాష్ట్రాలు నోడలు అధికారిని నియమించ లేదని వెంటనే నియమించాలని కేబినెట్ కార్యదర్శి సోమనాధన్ ఆదేశించారు. అనంతరం దేశవ్యాప్తంగా వివిధ చట్టాల డీరెగ్యులేషన్ పర్యవేక్షణకు నియమించబడిన కేబినెట్ డీరెగ్యులేషన్ సెల్ ద్వారా ఇప్పటి వరకు చేపట్టిన చట్టాల సరళీకరణ ప్రక్రియను కేబినెట్ కార్యదర్శి సోమనాధన్ సిఎస్ లతో సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయా నంద్ మాట్లాడుతూ ఇప్పటికే 21 అంశాలకు సంబంధించి నివేదికలను సమర్పించామని తెలిపారు.

ఈసమావేశంలో హెూం, ఎంఏయుడి శాఖల ముఖ్య కార్యదర్శులు కుమార్ విశ్వజిత్, ఎస్.సురేశ్ కుమార్, ఐఅండ్ఐ కార్యదర్శి డా.ఎన్.యువరాజ్, ఏపిఐఐసి ఎండి అభిషిక్త్ కిషోర్, లేబర్ కమీషనర్ శేశగిరి బాబు,న్యాయశాఖ అదనపు కార్యదర్శి సునీత తదితర అధికారులు పాల్గొన్నారు.

## నాగార్జున వర్సిటీలో అడ్డగోలు నియామకాలు

- అర్హత లేకున్నా ఉద్యోగ అవకాశాలు
- ఎ ఎన్ యు ప్రతిష్టను దిగజారుస్తున్న తాత్కాలిక వీసీ
- నాణ్యమైన విద్యా బోధన అందేనా? అంటున్న వర్సిటీ వర్గాలు
- విద్యా ప్రమాణాలను పాటించని తాత్కాలిక అధికారులు
- వర్సిటీపై ఉన్నత విద్యామండలి, విద్యాశాఖా మంత్రి దృష్టి సారించాలంటున్న వర్సిటీ సిబ్బంది



**గుంటూరు , నాగార్జున వర్సిటీ (జర్నలిస్ట్ ఫైల్)** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ ప్రత్యేకించి గుంటూరు జిల్లా ముఖచిత్రంలో ఎంతో కీర్తి ప్రతిష్టలు గడించి విలువలతో కూడిన విద్యాభ్యాసం అందించడంలో పేరెన్నిక గన్న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇటీవల ఎన్నో వివాదాలకు మూల కేంద్రం అవుతుంది. సంవత్సర కాలంగా తాత్కాలిక వీసీ పాలనలో పరీక్షల నిర్వహణ నుంచీ ఆ పరీక్షా ఫలితాల విడుదల వరకూ అడుగడుగునా వర్సిటీ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని ఎన్నో ఉదంతాలు సుస్పష్టం చేశాయి.

తాజాగా ఇటీవల వర్సిటీ అధికారులు మరో వివాదానికి తెర తీశారు. వర్సిటీలో ఎమ్ ఎస్ సీ ఫారెస్ట్రీ విభాగంలో అర్హత లేకున్నా ఇద్దరు అతిధి అధ్యాపకులను నియమించారని తద్వారా విద్యార్థినీ విద్యార్థులకు నాణ్యమైన పరిశోధనాత్మక విద్యాబోధన కుంటు పడే అవకాశాలు ఉన్నాయని పలువురు ఆచార్యులు వాపోతున్నారు. ఇటీవలే ఎమ్ ఎస్ సీ ఫారెస్ట్రీ కోర్సు లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులనే వెను వెంటనే అదే కోర్సుకు అధ్యాపకులుగా తాత్కాలిక పాలకులు నియమించారు. అధ్యాపకరంగంలో అనుభవం , పరిశోధక రంగంలో నిష్ణాతులుగా,పీ హెచ్ డీ పట్టాలు,యూజీసీ నెట్,ఆర్ సెట్ లో ఉత్తీర్ణత వంటి పలు అర్హతలు వారికి లేవని పలువురు అధ్యాపకులు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. అనుభవం కలిగిన అధ్యాపకులతోనే సరియైన విద్యా బోధన అందుతుందని ఆచార్యులు సైతం అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయంలో ఈ విధమైన చర్యలకు పాల్పడడంతో రాష్ట్ర ప్రభుత్వంపై కూడా విద్యార్థులకు, తల్లిదండ్రులకు వ్యతిరేక భావనలు కలుగుతున్నాయి. వర్సిటీలో పలు పదవులలో ఉన్న పలువురు అధ్యాపకులు విద్యాబోధనపై దృష్టి సారించడం లేదని విద్యార్థులు అంటున్నారు. ఇప్పటికైనా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, విద్యాశాఖ మాత్యులు వర్సిటీలో జరుగుతున్న ఇలాంటి అనైతిక చర్యలను అడ్డుకోవాలని కోరుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు దేశానికే ఆదర్శ ప్రాయంగా ఉండేలా రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖా మంత్రి చర్యలు తీసుకుంటున్నారని ఎ ఎన్ యు ని కూడా అందులో అగ్రగామిగా చేయాలని ఆకాంక్షిస్తున్నారు. తాత్కాలిక విసి బాధ్యతారాహిత్య ,అనుభవ రహిత చర్యలను అడ్డుకుని సమర్థవంతమైన ఉన్నత విద్యావేత్తలను రెగ్యులర్ వీసీ గా నియమించాలని విద్యార్థులు కోరుతున్నారు.

## మయన్మార్ లో కిడ్నాప్ కు గురైన ఆంధ్రప్రదేశ్ వారిని సురక్షితంగా తీసుకురండి



- ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

**ఢిల్లీ, (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువకులు ఉపాధి నిమిత్తం మయన్మార్ దేశానికి వెళ్లి అక్కడ కిడ్నాప్ కు గురయ్యారనీ వారిని సురక్షితంగా భారత్ కు తీసుకోచ్చేలా కేంద్ర ప్రభుత్వం చూడాలని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు. ఢిల్లీలో సోమవారం భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి బి. శ్యామ్ ను ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కలిశారు. ఈ సందర్భంగా విదేశాంగ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి బి. శ్యాం తో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ మయన్మార్ దేశ సరిహద్దు వద్ద మోసపూరితంగా బంధించబడి తీవ్రమైన హింస, బలవంతపు పనులకు గురవుతున్న ఆంధ్రప్రదేశ్ లోని నంద్యాల జిల్లా యువకులు గండబోయిన భువనేశ్, గండబోయిన దినేశ్ సహా 10 మంది భారతీయుల రక్షణ కోసం అత్యవసర చర్యలు తీసుకోవాలని కోరారు. వీరిని వెంటనే గుర్తించి సురక్షితంగా భారత్ కు తీసుకురావాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మన పౌరుల భద్రత, గౌరవం మా ప్రథమ కర్తవ్యమని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెప్పారు.

## చేనేత మగ్గానికి ఊపిరిపోశాం



- చెప్పింది చెప్పినట్లు అమలు చేశాం
- సీఎం చంద్రబాబు చరిత్రలో నిలిచిపోతారు
- యువనేత లోకేశ్ ఆధ్వర్యంలో చేనేతల జీవితాల్లో వెలుగులు
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- చేనేతకు ఏడాది రూ.25 వేలు, ఉచిత విద్యుత్ పథకాల అమలుపై హర్షం
- సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** చేనేత మగ్గానికి ఆయువుపోసి, నేతన్న జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చింది సీఎం చంద్రబాబు నాయుడు మాత్రమేనని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ఎన్నికల సమయంలో చేనేతలకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అమలు చేసిన సందర్భంగా సోమవారం స్థానిక వీవర్స్ కాలనీ పదో లైను సీఎం నసీర్ ఆధ్వర్యంలో చేనేత కుటుంబాలు సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నేతన్న భరోసా పథకం ద్వారా ప్రతి చేనేత కుటుంబానికి సంవత్సరానికి రూ. 25 వేలు ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. ఇది చేనేత కార్మికులకు ఆర్థిక భద్రత కల్పిస్తుందని చెప్పారు. ఉచిత విద్యుత్ పథకం ద్వారా చేనేత కార్మికుల కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తారని పేర్కొన్నారు. థ్రిఫ్ట్ ఫండ్ పథకం పునరుద్ధరణతో చేనేత కార్మికుడు నెలకు రూ. 1000 పొదుపు చేస్తే, ప్రభుత్వం మరో రూ. 2 వేలు జమ చేస్తుందని చెప్పారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ మొత్తం కార్మికుడి ఖాతాలో జమవుతుందన్నారు. చేనేత వస్త్రాలపై ఉన్న జీఎస్టీ భారాన్ని పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. టెక్స్‌టైల్స్ పాలసీ ద్వారా రూ. 10 వేల కోట్ల పెట్టుబడితో 1.51 లక్షల మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ కంకణం కట్టుకున్నారని తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో చేనేత కుటుంబాలకు నారా లోకేశ్ పెద్ద దిక్కుగా నిలిచారని పేర్కొన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో చేనేతలు మాట్లాడుతూ తమ జీవితాలకు ఆర్థిక భద్రత కల్పించిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుదేనని, ఆయనకు రుణపడి ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కన్నా మాస్టర్, దాసరి రాజా మాస్టర్, కార్పొరేటర్ ఆయిశెట్టి కనకదుర్గ, క్లస్టర్ ఇంచార్జ్ బత్తిన శంకర్, డివిజన్ అధ్యక్షులు, ముకుందరావు, జనసేన డివిజన్ అధ్యక్షులు పులిగడ్డ నాగేశ్వరరావు, గుంటి నరసింహారావు, లోకేశ్వరి, యర్రగోపు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## బంగారం క్షీణం, రూపాయి పతనం, కార్పొరేట్ లాభాల ఉత్సాహం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** సోమవారం(ఆగస్టు 11, 2025) నాడు భారత ఆర్థిక, వ్యాపార రంగంలో అనేక ముఖ్యమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి. స్టాక్ మార్కెట్‌లో ఒడిదుడుకులు, బంగారం, వెండి ధరల తగ్గుదల, అమెరికా-భారత్ వాణిజ్య ఉద్రిక్తతలు, మరియు కొన్ని ప్రముఖ సంస్థల త్రైమాసిక ఫలితాలు సోమవారం వార్తల్లో ప్రముఖంగా నిలిచాయి.

**స్టాక్ మార్కెట్: ఒడిదుడుకుల మధ్య ఆశాజనక ప్రారంభం :** సోమవారం భారత స్టాక్ మార్కెట్ సూచీలు సానుకూలంగా ప్రారంభమయ్యాయి. బీఎస్‌ఇ సెన్సెక్స్ 79,900 స్థాయి పైన ప్రారంభమై, రోజు చివరికి 746 పాయింట్ల లాభంతో 80,604 వద్ద ముగిసింది. అదే విధంగా, ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 24,350 పైన ప్రారంభమై, 24,550 స్థాయి వద్ద ముగిసింది. టాటా మోటార్స్, ఎటర్నల్ వంటి స్టాక్‌లు 3% లాభాలతో ముందంజలో నిలిచాయి. అయితే, ఐసిఐసిఐ బ్యాంక్ కొత్త సేవింగ్స్ ఖాతాల కోసం కనీస బ్యాలెన్స్ అవసరాన్ని పెంచడంతో దాని షేర్లు 1% పడిపోయాయి.

విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారుల (ఎఫ్‌పిఐ) నిరంతర ఉపసంహరణలు మార్కెట్‌పై ఒత్తిడిని కొనసాగిస్తున్నాయి. ఆగస్టు 1 నుంచి 8 వరకు ఎఫ్‌పిఐలు రూ. 17,924 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు, ఇది ఈ సంవత్సరం ఇప్పటివరకు మొత్తం రూ. 1.13 లక్షల కోట్ల ఉపసంహరణలో భాగం. అమెరికా-భారత్ వాణిజ్య ఉద్రిక్తతలు, రూపాయి విలువ పతనం, మరియు బలహీనమైన త్రైమాసిక ఫలితాలు ఈ ఉపసంహరణలకు ప్రధాన కారణాలుగా మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. అమెరికా భారతీయ వస్తువులపై 25% అదనపు సుంకాలను విధించడం మార్కెట్‌లో భయాందోళనలను పెంచింది.



**బంగారం, వెండి ధరల తగ్గుదల :** బంగారం ధరలు సోమవారం కొంత తగ్గుముఖం పట్టాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,03,030గా, 22 క్యారెట్ల బంగారం రూ. 94,440గా నమోదైంది, ఆదివారంతో పోలిస్తే రూ. 1,000 తగ్గింది. కిలో వెండి ధర రూ. 1,26,000గా ఉంది. అయితే, అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చితి కారణంగా బంగారం ధరలు ఆల్-టైమ్ గరిష్టస్థాయికి చేరువలోనే ఉన్నాయి. అమెరికా డాలర్ విలువ పతనం, స్టాక్ మార్కెట్ నష్టాలు, మరియు బంగారాన్ని సురక్షిత పెట్టుబడిగా భావించే పెట్టుబడిదారుల మనోభావం ఈ ధరల పెరుగుదలకు కారణాలుగా చెప్పబడుతున్నాయి. ఈ పరిస్థితి పెళ్లిళ్ల సీజన్‌లో ఆభరణాల కొనుగోలుదారులకు ఇబ్బందులను కలిగిస్తోంది.

**కంపెనీల త్రైమాసిక ఫలితాలు :** సోమవారం అనేక కంపెనీలు తమ ఏప్రిల్-జూన్ 2025 త్రైమాసిక ఫలితాలను ప్రకటించాయి. భారతి ఎయిర్‌టెల్ బలమైన ఫలితాలతో దృష్టిని ఆకర్షించింది. ఈ కంపెనీ భారత్ మరియు ఆఫ్రికా విభాగాల్లో 3% త్రైమాసిక ఆదాయ వృద్ధిని, 21% ఏడాది-పై-ఏడాది EBITDA వృద్ధిని నమోదు చేసింది. అధిక ARPU (సగటు ఆదాయం) మరియు రుణ భారం తగ్గించడం వల్ల ఈ ఫలితాలు సాధ్యమయ్యాయి. అదానీ గ్రూప్ కంపెనీలైన అదానీ పోర్ట్స్, అదానీ ఎలక్ట్రిసిటీ ముంబై, మరియు అదానీ గ్రీన్ ఎనర్జీలకు S&P గ్లోబల్ రేటింగ్స్ సానుకూల ఔట్‌లుక్‌ను అందించింది.

మరోవైపు, ఆదిత్య బిర్లా క్యాపిటల్ 10% లాభ వృద్ధితో రూ. 835 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది, అయితే దాని NBFC వ్యాపారంలో 18% డిస్బర్స్‌మెంట్ వృద్ధి కనిపించింది. మారికో కంపెనీ 9% లాభ వృద్ధిని, 23% ఆదాయ వృద్ధిని సాధించింది, అయితే ఔరోబిందో ఫార్మా నికర లాభం తగ్గుదలను నమోదు చేసింది.

**వాణిజ్య ఉద్రిక్తతలు మరియు రూపాయి పతనం:** అమెరికా భారతీయ ఎగుమతులపై 25% అదనపు సుంకాలను విధించడం దేశీయ ఎగుమతిదారులను కలవం పెడుతోంది. రష్యా చమురు దిగుమతులపై అమెరికా ఆంక్షల నేపథ్యంలో, భారత్‌పై ఏటా రూ. 78,000-96,000 కోట్ల భారం పడే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ సుంకాలను ఎదుర్కొనేందుకు ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (PLI) పథకం తరహాలో ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టాలని ఎగుమతిదారులు ప్రభుత్వాన్ని కోరారు.

ఇదే సమయంలో, రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే రికార్డు కనిష్ఠ స్థాయి 87.65కి పడిపోయింది. ఆయిల్ కంపెనీలు, దిగుమతిదారుల డిమాండ్ మరియు విదేశీ పెట్టుబడిదారుల షేర్ విక్రయాలు ఈ పతనానికి కారణాలుగా చెప్పబడుతున్నాయి.

**ఇతర ముఖ్యమైన వార్తలు :**

**టెస్లా భారత్‌లో విస్తరణ :** అమెరికన్ ఎలక్ట్రిక్ వాహన దిగ్గజం టెస్లా ఢిల్లీలోని ఏరోసిటీలో రెండవ స్టోర్‌ను సోమవారం ప్రారంభించింది, భారత్‌లో ఎలక్ట్రిక్ వాహన మార్కెట్‌ను బలోపేతం చేస్తూ.

**అమెజాన్ ఏఐ బూస్ట్ :** అమెజాన్ భారత్‌లో $12.7 బిలియన్ ఏఐ పెట్టుబడిని ప్రకటించింది, ఇది సాంకేతిక రంగంలో భారత్ యొక్క స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

**బ్యాంకింగ్ రంగం :** పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రూ. 30 లక్షల కోట్ల వ్యాపార మైలురాయిని చేరుకుంటుందని ఎండీ అశోక్ చంద్ర వెల్లడించారు.

**ముగింపు :** ఆగస్టు 11, 2025, భారత ఆర్థిక రంగంలో ఒక ఆసక్తికరమైన రోజుగా నిలిచింది. స్టాక్ మార్కెట్‌లో సానుకూల ప్రారంభం, బంగారం ధరల తగ్గుదల, మరియు కంపెనీల బలమైన త్రైమాసిక ఫలితాలు పెట్టుబడిదారులకు కొంత ఉత్సాహాన్ని అందించాయి. అయితే, అమెరికా సుంకాలు మరియు రూపాయి పతనం వంటి సవాళ్లు మార్కెట్‌పై ఒత్తిడిని కొనసాగిస్తున్నాయి. రాబోయే రోజుల్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్ణయాలు మరియు వాణిజ్య చర్చలు మార్కెట్ దిశను నిర్ణయించే అవకాశం ఉంది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467